జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన
నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?
మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది
వివరాలకు సంప్రదించండి 8886022523

సంపుటి 5 సంచిక 235 | హైదరాబాద్, జూన్ 15 బుధవారం 2022 | 8 పేజీలు | వెల : 5.00



# ఐదు రాష్ట్రాలపై కేసీఆర్ నజర్?

హైదరాబాద్, జూన్ 14, : ప్రజా పాలన ప్రతినిధి : టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్ పేరుతో జాతీయ స్థాయి పార్టీగా తీర్చిదిద్దాలని ప్రయత్నం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఇందుకోసం సెంటిమెంట్‌ను నమ్ముకున్నట్లు తెలుస్తోంది. బీజేపీ, కాంగ్రెస్‌లను ఎదుర్కోవాలంటే తొలుత దక్షిణాది రాష్ట్రాలను ఏకం చేయాలని భావిస్తున్నారట. ప్రస్తుతం దేశ రాజకీయాల్లో నార్త్ ఇండియా, సౌత్ ఇండియా అనే భావన బలంగా ఉంది. దక్షిణాదికి చెందిన వారికి ఢిల్లీ రాజకీయాల్లో అంతగా ప్రాధాన్యత లభించడం లేదనే విమర్శ ఉంది. పైపెచ్చు ఉత్తరాది నేతల అభిప్రాయలను బలవంతం గా రుద్దుతున్నారనే టాక్ వినిపిస్తూనే ఉంది. ఈ అంశాన్నే ప్రధాన ఎజెండాగా భారతీయ రాష్ట్ర సమితికి బూస్టర్ డోస్‌గా మార్చుకోబోతున్నారట కేసీఆర్. కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం ఉండగా ఆంధ్రప్రదేశ్‌లోని వైసీపీ మోడీ ప్రభుత్వంతో కంఫర్ట్ గా వ్యవహరిస్తోంది. మిగిలిన దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, కేరళ, తమిళనాడు ముఖ్యమంత్రులు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం నుండి సరైన సహకారం అందడం లేదనే విషయాన్ని బీఆర్ఎస్ ద్వారా కేసీఆర్ సెంటిమెంట్ ను రగిల్చబోతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఏపీకి చెందిన మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్‌తో జరిగిన సమావేశంలో కేసీఆర్ తన మనసులో ఉన్న విషయాన్ని వివరించినట్లు తెలుస్తోంది. అన్ని సవ్యంగా జరిగితే ఏపీలో బీఆర్ఎస్ బాధ్యతలు ఉండవల్లి చేతిలోకి చేరే అవకాశాలు లేకపోలేదనేది పొలిటికల్ సర్కిల్స్‌లో వినిపిస్తున్న మాట. బీఆర్ఎస్‌ను విస్తరించే క్రమంలో టీడీపీ వ్యవస్థాప అధ్యక్షుడు ఎన్టీఆర్, కాంగ్రెస్ నేత, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు ఫొటోలతో ముందుకు వెళ్లబోతున్నారనే చర్చ తెరపైకి వస్తోంది. ఇటీవల పీవీ కుమార్తె టీఆర్ఎస్ టికెట్ పై ఎమ్మెల్సీగా గెలుపొందిన సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేని విధంగా (మిగతా 2లో..)

# దారిలోకొచ్చిన ధరణి సమస్య..

## సీఎం కేసీఆర్ ఆదేశాలతో మరిన్ని ఆప్షన్లు

హైదరాబాద్, జూన్ 14, : ప్రజా పాలనప్రతినిధి : ధరణి సమస్యలను నివారించి రైతులను కార్యాలయాల చుట్టూ తిరిగే బాధలు లేకుండా చూడాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాలతో రైతులకు కష్టాలు తీరనున్నాయి. ధరణి పోర్టల్‌తో ఇబ్బందులు పడుతున్న రైతుల బాధలను తొలగించేందుకు సర్కార్ కీలక కార్యాచరణ చేపట్టింది. సీఎం కేసీఆర్ ఆదేశాలతో సీఎస్, సబ్ కమిటీ చైర్మన్ హరీష్‌రావులతో కూడిన బృందం గురువారం క్షేత్ర స్థాయికి చేరుకుని ప్రత్యక్షంగా సమస్యలపై అధ్యయనం చేశారు. గురువారం ఈ మేరకు ధరణి పోర్టల్ రోజూవారీ కార్యకలాపాల్లో తలెత్తుతున్న సమస్యలను పూర్తిగా రూపుమాపేందుకు, పరిష్కార మార్గాలపై సీఎస్ సోమేష్‌కుమార్, సీఎంఓ కార్యదర్శి స్మితా సబర్వాల్‌తో కలిసి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, ధరణి సమస్యలపై ఏర్పాటైన సబ్ కమిటీ చైర్మన్ హరీష్‌రావుతో భేటీ అయ్యారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి సమస్యలను గుర్తించాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాలతో సబ్ కమిటీ చైర్మన్, మంత్రి హరీస్‌రావు, సీసీఎల్ఏగా ఉన్న సీఎస్ సోమేష్ కుమార్, సిద్ధిపేట జిల్లా ములుగు లో సమీక్షించి సమస్యలపై చర్చిం చారు. తాజా భేటీలో ప్రధానంగా పాస్ పుస్తకాలు, ధరణి పోర్టల్‌లో పేర్ల తప్పులు, విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు, సర్వే నెంబర్ల పార్టుల సంబంధిత వివరాల్లో తేడాల వంటివాటిపై చర్చించారు. ఈ కమిటీ ధరణి పోర్టల్‌లో ఉన్న లోపాలపై అధ్యయనం చేస్తోంది. రాష్ట్ర ఉన్నతాధికారులతో కూడిన బృందంతో కలిసి చర్చించి, అధ్యయనం చేసి పరిష్కార మార్గా లతో కూడిన కొత్త మాడ్యూళ్లను ప్రవేశపెట్టాలనే యోచనపై సమీక్షించారు. క్షేత్రస్థాయిలో ఉత్పన్నమయ్యే సమస్యలపై కూడా సుధీర్ఘంగా చర్చించారు. ఇప్పటి వరకు వచ్చిన ఫిర్యాదులను ఎలా పరిష్కరించాలనే అంశంపై కూడా కూలంకషంగా చర్చించారు. ధరణి పోర్టల్‌లో సమస్యల అధ్యయనానికి సంబంధించి వచ్చిన ఫిర్యాదులన్నింటినీ ఒక్కొక్కటిగా చర్చించి, వాటిలో సాంకేతికంగా ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు, ఇతర అంశాలను ఈ సమావేశం చర్చించింది. ధరణి పోర్టల్‌కు వచ్చిన సమస్యలు, వాటి పరిష్కారం, వివిధ మాడ్యూల్స్ సమస్యలను చర్చించారు.

(మిగతా 2లో..)

# తెలుగు భాషకు తెలంగాణలో పెద్దపీట..!

## ఇక ఆ స్కూళ్లలోనూ తెలుగు కంపల్సరీ



హైదరాబాద్, జూన్ 14, : ప్రజా పాలనప్రతినిధి :ఈ ఏడాది నుంచి సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ, ఇతర బోర్డు అనుబంధ స్కూళ్లలో తెలుగును ద్వితీయ భాషగా, తప్పనిసరిగా బోధించాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. బోర్డులు, బోధనా మాధ్యమంతో సంబంధం లేకుండా తెలుగును బోధించాలని ఆదేశాలిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం 2018-19 నుంచి దశలవారీగా తెలంగాణ (పాఠశాలల్లో తెలుగు తప్పనిసరి బోధన, అభ్యాసం) చట్టం 2018 అమల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. భావితరాలకు ఉపయోగపడేలా తెలుగు భాషా, సాహిత్యాన్ని పరిరక్షించేందుకు అన్ని పాఠశాలల్లో మాతృభాషను తప్పనిసరి చేశారు. గత విద్యా సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు తెలుగు భాషా బోధనను తప్పనిసరి చేశారు. ఈ విద్యాసంవత్సరం అంటే 2022-23లో అన్ని పాఠశాలల్లో 1-10వ తరగతి వరకు తెలుగును ఒక భాషగా అమలు చేస్తారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. తెలుగు మాతృభాష కాని పిల్లల కోసం 1-5వ తరగతి వరకు 'తేనెపలుకులు', 6 -10వ తరగతి వరకు 'వెన్నెల' పేరుతో పాఠ్యపుస్తకాలను రూపొందించారు. తెలుగు మాతృ భాషగల విద్యార్థుల కోసం ప్రామాణిక పాఠ్యపుస్తకాలను అందుబాటులో ఉంచారు. 1-5వ తరగతి వరకు 'జాబిలి', 6,7,8 తరగతుల కోసం 'నవ వసంతం', 9,10వ తరగతులకు 'సింగిడి' పేరుతో పుస్తకాలను రూపొందించారు. ఈ పుస్తకాలు రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణా మండలి ఎస్సీఈఆర్టీ వెబ్‌సైట్ http://scert.telangana.gov.in లో అందుబాటులో ఉంచారు. ఇక.. వివిధ బోర్డులకు అనుబంధంగా ఉన్న అన్ని పాఠశాలలు తెలుగు బోధించేందుకు ఉపాధ్యాయులను నియమించడంతోపాటు ఎస్సీఈఆర్టీ రూపొందించిన పాఠ్యపుస్తకాలను అనుసరించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. నిబంధనలను ఉల్లంఘిస్తే తీవ్రంగా పరిగణిస్తామని, తప్పు చేసిన యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీచేస్తామని, జరిమానా విధించడం లేదా గుర్తింపు రద్దుచేయడంలాంటి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# జులై మూడో వారం నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాలు..!



ఢిల్లీ, ప్రజాపాలన ప్రతినిధి: పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. అధికారికంగా ప్రకటించకపోయినా జులై మూడో వారం నుంచి సభ కొలువు దీరనున్నట్లు సమాచారం. జులై మూడోవారం నుంచి ఆగస్టు రెండో వారం వరకు ఉభయసభలను సమావేశపర్చనున్నట్లు వార్తలు వస్తున్నాయి. రాష్ట్రపతి ఎన్నిక జరగనున్న జులై 18న వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఆగస్టు 12 వరకు సభ కొనసాగించాలని పార్లమెంటరీ అఫైర్స్ కేబినెట్ కమిటీ నిర్ణయించినట్లు సమాచారం. సభ నిర్వాహణకు సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది. మాన్ సూన్ సెషన్ లో ఉభయ సభలు 17 రోజుల పాటు కొనసాగనున్నట్లు తెలుస్తోంది. బడ్జెట్ సెషన్ లో పార్లమెంటరీ కమిటీ స్క్రూటినీకి పంపిన నాలుగు బిల్లులతో పాటు పలు బిల్లులు ఈసారి సభ ముందుకు రానున్నాయి.

# విండ్ పవర్ ప్రాజెక్టు ఆదానీ వశం



ఢిల్లీ, ప్రజాపాలన ప్రతినిధి: భారత ప్రధాని నరేంద్ర మోదీపై సోషల్ మీడియాలో పలు రకాల విమర్శలు, ఆరోపణలు వస్తున్నాయి. మోదీ భారత ప్రజల ఖర్చుతో పారెన్ టూర్‌కు వెళ్లి ఇండియాకు మేలు చేసే పనులు చేయాల్సింది పోయి.. తన జిగిరీ దోస్త్, బడా వ్యాపారవేత్త అదానికి ఆమ్‌దానీ చేకూరుస్తున్నారని మీమ్స్ రూపంలో ట్రోలింగ్ జరుగుతోంది. దీనికి పలు రకాల ఉదాహరణలు కూడా చూపుతున్నారు. ఇందులో బాగా ఇంట్రెస్టింగ్‌గా, ఎక్కువగా ట్రోలింగ్‌లో ఉన్న ట్వీట్ మాత్రం ఈ మధ్య తెలంగాణ ప్రభుత్వ విప్, బాల్క సుమన్ చేసింది సూపర్ అంటున్నారు నెటిజన్లు. సోషల్ మీడియాలో ఈ ట్వీట్‌ని తెగ వైరల్ చేస్తున్నారు. 167.7కె ఫాలోవర్లతో మాంచి జోష్ మీదున్న బాల్క సుమన్ ప్రజా సమస్యలు, సామాజిక అంశాలపై సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటారు. వాటిలో కేంద్ర ప్రభుత్వం తీరును ప్రశ్నిస్తూ చేసేవి కూడా ఎక్కువగా ఉంటాయి. వీటిలో ప్రధాని మోదీపై చేసిన ఈ ట్వీట్ సూపర్‌గా హల్‌చల్ చేస్తోంది.

# కేసీఆర్ హనీ ట్రాప్ లో ఉండవల్లి: రేవంత్ రెడ్డి



హైదరాబాద్, జూన్ 14, : ప్రజా పాలనప్రతినిధి :కేసీఆర్ ప్రయోగించిన హనీ ట్రాప్ లో ఉండవల్లి పడ్డారని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. టీఆర్ఎస్, బీజేపీ ఒకటేనన్న రేవంత్ ఈ లాజిక్ ఉండవల్లికి అర్థం కావడం లేదన్నారు. కేసీఆర్ తో భేటీ తర్వాత ఉండవల్లి ఆయన భజన చేస్తుండని..ఆయన పట్ల గతంలో గౌరవం ఉండేదని..కానీ ఇప్పుడు అది లేదని అన్నారు. సోనియా, రాహుల్ సహా విపక్ష నాయకులను కేసులతో పేరుతో వేధిస్తున్న మోడీ కేసీఆర్ పై మాత్రం ఈగ వాలకుండా చూసుకుంటున్నారని ఆరోపించారు. కేసీఆర్- మోడీది ఫెవికాల్ బంధం అని వ్యాఖ్యానించారు. విభజన మీద ఉండవల్లి రెండు పుస్తకాలు రాశారని..తెలంగాణ ఉద్యమకారులను రజాకార్ల పేరుతో అవమానించారని చెప్పారు. అటువంటి వ్యక్తిని సీఎం కేసీఆర్ ప్రగతిభవన్ కు పలిచి అతిథి సత్కారాలు చేయడం సిగ్గుచేటన్నారు రేవంత్. దోచుకున్న సొమ్మును కాపాడుకోవడం కోసమే కేసీఆర్ కొత్త డ్రామాలకు తెరదీశారని రేవంత్ ఆరోపించారు. బీజేపీ వ్యతిరేక ఓటును చీల్చి మోడీని గద్దెనెక్కించడమే కేసీఆర్ లక్ష్యమని తెలిపారు. బీఆర్ఎస్ అంటే బీహార్ రాష్ట్ర సమితి అని..సార పాతదే కానీ సీసా కొత్తదన్నట్లుగా దాన్ని తీరు ఉందన్నారు. కేసీఆర్ ఉండవల్లిని కలవడం తెలంగాణ సమాజం సహించదని..అరుణ్ కుమార్ కూడా కేసీఆర్ గురించి అన్ని వాస్తవాలు తెలుసుకుని వ్యవహరించడం మంచిందని హితవు పలికారు.

# తెలంగాణలో గ్రూప్-1 ప్రిలిమ్స్ తేదీ ఖరారు..

## ప్రకటించిన టీఎస్‌పీఎస్సీ

హైదరాబాద్, జూన్ 14, : ప్రజా పాలన ప్రతినిధి :తెలంగాణలో గ్రూప్-1 ప్రిలిమ్స్ తేదీ ఖరారైంది. అక్టోబర్ 16న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించనున్నట్లు వెల్లడించింది. జనవరి లేదా ఫిబ్రవరిలో మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. తెలంగాణ తొలి గ్రూప్-1 ప్రకటనకు భారీ స్పందన లభించిన సంగతి తెలిసిందే. గడువు ముగిసే నాటికి (జూన్ 4) మొత్తం 503 పోస్టులకు 3,80,202 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో పోస్టుకు సగటున 756 మంది చొప్పున పోటీపడుతున్నారు.

మాస్టర్ కీ TV
(అంబేడ్కర్ TV)
జై భీం,
మీరు నాయకుడిగా ఎదగాలని అనుకుంటున్నారా...?
మీరనుకున్న వార్తలు రావాలని కోరుకుంటున్నారా...?
పెట్టుబడి లేకుండా ఆదాయం పొందాలని అనుకుంటున్నారా...?
మీరూ మీ అసెంబ్లీ నియోజకవర్గం లో
టీవీ ఛానల్ ఓనర్ గా కావాలని అనుకుంటున్నారా...?
అయితే రండి, కదలి రండీ
బహుజనాభివృద్దే.. దేశాభివృద్ధి అని నిరూపిద్దాం
1. ఈ దేశంలో ఉన్న ఫోర్త్ ఎస్టేట్ (మీడియా రంగం) బహుజనుల సమస్యల మీద ప్రచారం చేయడం లేదని మీ అందరికీ తెలుసు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా విలేఖరులకు సామాజిక కార్యకర్తలకు, అంబేడ్కర్, పూలే సంఘం నాయకులకు, కనీసం 100 మంది తెలిసిన గ్రూపునాయకులకు టీవీ ఛానల్ ప్రతినిధిగా / యజమానిగా అవకాశం ఇవ్వబడును.
2. జీవిత కాలంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతినిధిగా / యజమానిగా నియమించబడును.
3. ఆయా ప్రతినిధికి ప్రకటనల ఆదాయం (Advertising Revenue)లో ప్రకటనలపై 40% ఆదాయం ఇవ్వబడును.
4. వార్తలను స్వేచ్ఛాయతంగా ప్రసారం (Telecast) చేసే వీలు కల్పించబడును.
సంప్రదించండి
Tel No: 9849031420 ,9440918143, 94409 18371, 94400 53858, 93473 50692,8008840506, 9440077239, 7798832998, 76600 27678,
Office: Ambedkar TV Channel, 3rd Floor, Dault Plaza, Main Road, Besides Bata Showroom, Lakdi ka pool, Hyderabad - 500004
E- mail : ambedkartvchannel2018@gmail.com www.ambedkartv.org

## నేడు జిల్లాకు మంత్రి రాక

మంచిర్యాల బ్యూరో, జూన్ 14, ప్రజాపాలన:జిల్లాలో ఈ నెల 15వ తేదీన రాష్ట్ర రోడ్లు భవనాలు, శాసన వ్యవహారాలు, హౌసింగ్ శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పర్యటించనున్నట్లు పి.ఎ. టు మినిస్టర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ ఉదయం 9 గం?లకు మందమర్రి మండలం క్యాతన్పల్లి పట్టణంలోని ప్రభుత్వ విప్, చెన్నూర్ శాసనసభ్యులు బాల్క సుమన్ నివాసానికి చేరుకొని అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో పాల్గొంటారని తెలిపారు. ఉదయం 10 గం?లకు జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను పరిశీలించి, 10.45 గం?లకు భీమారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన టి.ఆర్.ఎస్. పార్టీ మండల కార్యాలయం, 10.50 గం?లకు ఈ-రైతు వ్యవసాయ అవసరాల షాప్, 11 గం?లకు చెన్నూర్ మండలం కిష్టంపేట వద్ద 3 కోట్ల 50 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన వంతెన ప్రారంభిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 12 గం?లకు 10 కోట్ల రూపాయల నిధులతో సుద్దాల వాగుపై నూతనంగా నిర్మించ తలపెట్టిన వంతెన పనులకు శంఖుస్థాపన చేస్తారని, 1 గం?లకు చెన్నూర్ మండలంలో 1 కోట్ల 97 లక్షల రూపాయలలో నూతనంగా నిర్మించిన గంగారం వంతెన, 2 గం?లకు 4 కోట్ల 80 లక్షల రూపాయలతో నిర్మించిన సుబ్బరాంపల్లి వంతెన, సాయంత్రం 4 గం.ఎలకు కోటపల్లి మండలం బంధం గ్రామం వద్ద తుంతుంగ వాగుపై 8 కోట్ల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన వంతెన ప్రారంభిస్తారని తెలిపారు. సాయంత్రం 6 గం?లకు కోటపల్లి నుండి బయలుదేరుతారని తెలిపారు.

## అన్యాయంగా మా ఇల్లును కూల్చేశారు: రామిల్ల ఆశయ్య



మంచిర్యాల టౌన్, జూన్ 14, ప్రజాపాలన : అన్యాయంగా ఇల్లును కుల్చరని జిల్లా కలెక్టర్ ఏ ఓ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షెట్టిపేట్ మండలంలోని గుల్లకోట గ్రామ పంచాయతీ పరిధిలోని మిట్టపల్లి గ్రామంలో ఇంటి నెంబర్ 8-183 లో నివాసం ఉంటున్న రామిల్ల ఆశయ్య తండ్రి: పోచయ్య. గుల్లకోట గ్రామ పంచాయతీ రికార్డు నందు 2007 సంవత్సరం నుండి 2018 వరకు ఉన్నాం, తర్వాత మిట్టపల్లి నూతన గ్రామ పంచాయతీ గా ఏర్పడింది. ఆ ఇంటిని రికార్డు లో చేర్చమని గ్రామ పంచాయతీ కార్యదర్శి పలుమార్లు కలసిన నమోదు చేయలేదని చెప్పారు. ఎలాంటి ముందస్తు నోటీసు లు ఇవ్వకుండా సోమవారం రోజున గ్రామ పంచాయతీ కార్యదర్శి, మండల ఎంపీడీఓ వచ్చి, ఉన్న ఇంటిని కూల్చివేశారు. వెంటనే ఈ కూల్చివేత పై విచారణ చేసి పంచాయతీ కార్యదర్శి, మండల ఎంపీడీఓ పై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## శ్రీ శ్రీ శ్రీ దయానంద గిరి స్వామి జీ శ్రీరామకోటి,శ్రీమద్ భగవద్గీత జ్ఞాన యజ్ఞం,హోమాలు



ఇబ్రహీంపట్నం జూన్ 14 ప్రజా పాలన ప్రతినిధి: ఇబ్రహీంపట్నం నియోజకవర్గం యాచారం మండలంలోని మేడిపల్లి గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో శ్రీ రామకోటి సేవాసమితి నాంపల్లి వారి ఆధ్వర్యంలో,మేడిపల్లి గ్రామసర్పంచ్ పాలకవర్గం, భక్త బృందం సహకారంతో 12వ శ్రీ రామకోటి శ్రీలక్ష్మి శ్రీమద్ భగవద్గీత జ్ఞాన యజ్ఞం రెండు దినములు నిర్వహించగా చివరి రోజైన మంగళవారం శ్రీశ్రీశ్రీ దయానందగిరి స్వామీజీ సభాధ్యక్షత ఘనంగా శ్రీ రామకోటి జ్ఞాన ప్రవచనాలు, హోమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని విచ్చేసిన భక్తులకు,ప్రజానీకందరికీ అన్నదాన (వితరణ) ప్రభువు కార్యక్రమం సర్పంచ్ చిగురింత శ్రీనివాస్ రెడ్డి ,1 వ వార్డు మెంబర్ ఆడాల వరలక్ష్మి గణేష్ నిర్వహించారు.సగటు మానవాళి జీవితాలలో ఆధ్యాత్మికత దైవారాధన కరువైందని, మోక్ష మార్గానికి ప్రశాంతతకు దైవారాధన ముఖ్యమని శ్రీ దయానందగిరి స్వామీజీ ప్రజలకు సూచించారు.గ్రామ ప్రజలందరూ కుటుంబంతో సహా ఈ కార్యక్రమానికి విచ్చేసి సమయం కేటాయించినందుకు సర్పంచ్ పాలకవర్గం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అలంపల్లి సత్తమ్మ కృష్ణ, ఎంపీటీసీ మొరుగు శివలీల రమేష్,మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్ రెడ్డి,మాజీ సర్పంచులు కర్నాటి రంగారెడ్డి,బోడ కృష్ణ,బాలరాజ్ గౌడ్,పాశ్చ బాషా,వార్డు సభ్యులు, కలకొండ బీరప్ప భక్తులుగ్రామప్రజలు, పాల్గొన్నారు.

## మధిర రూరల్ ఎస్ఐగా నరేష్



మధిర జూన్ 14 ప్రజా పాలనప్రతినిధి మధిర రూరల్ ఎస్సై గా నరేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థను అమలు చేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు గతంలో ఆయన విఎం బంజర వేంసూరు సత్తుపల్లి తల్లాడ టాస్క్ ఫోర్స్ లో పని చేశారు. ఇప్పటివరకు మధిర రూరల్ ఎస్ఐ గా పనిచేసిన భవాని ఖమ్మం బదిలీ అయ్యారు ఆయన స్థానంలో నరేష్ బాధ్యతలు స్వీకరించారు.

# తవ్వకునోడికి తవ్వకున్నంత..

- జేసిబిలతో ఎర్ర మట్టి తవ్వకాలు, గుట్టచప్పుడు కాకుండా జిల్లా కేంద్రంలో విక్రయాలు
- ఎర్ర మట్టి దందా పై నియంత్రణ కోల్పోయిన అధికారులు..?
- పర్మిషన్ ఉందని బరితెగిస్తున్న అక్రమార్కులు
- మామూలుగా తీసుకుంటున్న సంబంధించిన అదికారులు







మంచిర్యాల బ్యూరో, జూన్14, ప్రజాపాలన:మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం రామారావు పేట శివారులో ని గోదావరి దగ్గర, ఒసికి ఆనుకుని ఉన్న ఒక రైతులకు సంబంధించిన వ్యవసాయ భూమి ని జేసిబి లతో తవ్వుతూ ఎర్రమట్టి దందా నడుపుతున్నట్లు స్థానిక ప్రజలు తెలిపారు. ఇక్కడి ఎర్రమట్టిని మంచిర్యాల టౌన్ లో విక్రయిస్తున్నారని సమాచారం. ఐతే ఈ భూమి సింగరేణి కి అప్పగించి , దానికి సంబంధించిన పారితోషికం రైతు పొందాడని కొందరు పేర్కొంటే.. మరి కొందరూ రైతులకు పరిహారం అందలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో ఇది సింగరేణి స్థలమా లేక రైతు భూమా అనేదాని పై బిన్న వాదనలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడి నుండి చేస్తున్న మట్టి వ్యాపారం అక్రమమా..? సక్రమా అనే చర్చ స్థానిక ప్రజల్లో జరుగుతుంది.

**స్పష్టత ఇవ్వాని అదికారులు**

స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ప్రజాపాలన ప్రతినిధి ఆ ప్రాంతానికి వెళ్ళి వివరాలు సేకరించడం జరుగింది. జేసిబి తో మట్టిని తవ్వతూ లారీల ద్వారా మంచిర్యాల సున్నంబట్టి ,తదితర ప్రాంతాల్లో మట్టి విక్రయాలు చేస్తున్న సమాచారం ను జైపూర్ తాసిల్దార్ కు తెలుపగా స్పందించిన తాసిల్దార్ ఆ గ్రామ విఆర్ఎ ను పంపించి తవ్వకాలు నిలిపి వేశారు. ఐతే రైతు నుండి కానీ మట్టిని తీస్తున్న ఒక ప్రజాప్రతినిధి నుంచి కానీ మట్టి తీతకు సంబంధించిన అనుమతి పత్రం చూడకుండానే వాహనాలు వదిలేశాడనే విమర్శలు వచ్చాయి. రెండు మూడు రోజులు గడిచిన ఈ విషయంపై అదికారివద్ద సరైన సమాచారం లేక పోవడం కొసమెరుపు.

**మైనింగ్ అధికారులు అనుమతి ఇచ్చారు : తాహాసీల్దార్**

జైపూర్ మండలం రామారావు పేట శివారులో ని గోదావరి దగ్గర, ఒసికి ఆనుకుని ఉన్న ఒక రైతులకు సంబంధించిన వ్యవసాయ భూమి ని జేసిబి లతో తవ్వుతూ ఎర్రమట్టి తీస్తున్న విషయంలో తాసిల్దార్ వంగల మోహన్ రెడ్డి వివరణ ఇచ్చారు. భూమికి సంబంధించిన రైతు మైనింగ్ అధికారులనుండి అనుమతి పొందినట్ల తెలిపారు. అనుమతి పత్రాలను చూపించిన తర్వాతే వాహనాలు వదినట్లు తాసిల్దార్ తెలిపారు.

**మట్టి తవ్వకానికి అనుమతి ఉంది: మైనింగ్ అధికారి బాలు.**

జిల్లా లో ఎర్రమట్టి తవ్వకాల కు సంబంధించి పలువురు అనుమతులు పొందారని జిల్లా మైనింగ్ అధికారి బాలు పేర్కొన్నారు. ఎర్ర మట్టి తవ్వకాల పై ప్రజాపాలన వివరణ అడిగినప్పుడు పైవిధంగా ఆయన స్పందించారు. జైపూర్ మండలం రామారావు పేట శివారులో ని గోదావరి దగ్గర, ఒసికి ఆనుకుని ఉన్న ఒక రైతులకు సంబంధించిన వ్యవసాయ భూమి లో మొరం తవ్వకం విషయంలో రైతు అనుమతి పొందారని తెలిపారు. నిబంధనలు ఏమీ ఉండవని రైతుకు ఇష్టం వచ్చినంత లోతుగా భూమిని తవ్వుకోవచ్చని తెలిపారు.

## పల్లె ప్రగతి అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



ఆసిఫాబాద్ జిల్లా జూన్ 14 (ప్రజాపాలన, ప్రతినిధి) : జిల్లాలో 5 వ విడత పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేసే విధంగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవనం లో "జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్" పాయి తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులతో పరీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా ఈనెల 18వ తేదీన గ్రామసభ నిర్వహించి పెండింగ్లో ఉన్న పనుల వివరాలతో నివేదిక తయారు చేసి అందించారని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామాల్లో ఎక్కడ కూడా చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రతిరోజు ఇంటింటికీ తిరుగుతూ తడి పొడి చెత్తను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని తెలిపారు. బృహత్ పల్లె ప్రకృతి వనాలలో చనిపోయిన మొక్కలు స్థానములో కొత్తవి పెద్ద మొక్కలు నాటి రక్షించాలని, ప్రతి ఎకరానికి 4 వేల మొక్కలు ఉండేవిధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. జిల్లాలో ఆయా మండలాలకు కేటాయించిన ఈ విధంగా క్రీడా ప్రాంగణాలను సిద్ధం చేయడంతో పాటు అవసరమైన క్రీడా సామాగ్రిని అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చలో ఖమ్మం మున్నూరుకాపు బిడ్డరాజ్యసభ సభ్యులు గాయత్రీ రవి సన్మానం



మధిర జూన్ 14 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం నాడు మున్నూరు కాపు సమావేశంలోహా చలో ఖమ్మం మున్నూరుకాపు మహాసభ ఈనెల 18- 6- 2022న,శనివారం మూడు గంటలకు సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియం నందు మహా సభను ఏర్పాటు చేసినారుహా ఖమ్మం మున్నూరు కాపు ముద్దుబిడ్డ రాజ్యసభ సభ్యుడు గాయత్రి రవి గారు ఖమ్మం జిల్లాకు విచ్చేయుచున్నారు కావున వారికి మహా సన్మాన చేస్తున్నారు కావున వారికి జరగబోవు సన్మాన కార్యక్రమాన్ని దిగ్విజయం చేయవలసిందిగా ఖమ్మం జిల్లా మున్నూరు కాపు ముద్దుబిడ్డ అందరి అందరినీ కోరడం జరిగినది రేపు జరగబోయే మహాసభకుహా గ్రామీణ వారిగా మండలాల వారీగాహా ప్రతి ఒక్కహా మున్నూరు కాపు ముద్దుబిడ్డ స్వచ్ఛందంగా ఈ యొక్క కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరుచున్నాము రేపు జరగబోయే మున్నూరుకాపు మహాసభ కు మధిర మున్నూరు కాపు ఆఫీసు నందుహా సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగినది ఈ సమావేశంలో మున్నూరు కాపు ముద్దుబిడ్డ మధిర నియోజకవర్గ అధ్యక్షులు ఆళ్ల కృష్ణ గారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రేపు జరగబోయే గాయత్రి రవన్న సన్మాన కార్యక్రమానికి మండల మున్సిపాలిటీ గ్రామస్థాయిలో వెహికల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేసినారు కావున తమ తమ విలేజ్ ల్లో బయలుదేరు వారుహా అధ్యక్షుడు ఆళ్ల కృష్ణను ,99885251818 9059316918హా సంప్రదించవలసినదిగా కోరుచున్నాము ఈ కార్యక్రమంలో మధిర మున్సిపాలిటీ అధ్యక్షులుహా నీలం వెంకటేశ్వరరావు పసుపులేటి నాగేంద్ర శ్రీనివాస్ దేవిశెట్టి కృష్ణ చింతల నాగేశ్వరరావు సీపాల చెట్టు వెంకట్రావు గూడవల్లి నారాయణ గాజుల నాగేశ్వరరావు చింత ఎలమంద మేడిశెట్టి శ్రీ హరి కృష్ణ

## ఐదు రాష్ట్రాలపై కేసీఆర్ నజర్?

(మొదటి పేజీ తరువాయి)

ఎన్టీఆర్ జయంతి రోజు టీఆర్ఎస్ మంత్రులు నివాళి అర్పించిన విషయం తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో కేసీఆర్ నిర్ణయాలు వ్యూహాత్మకంగా ఉండబోతున్నాయనే సంగతి స్పష్టం అవుతోంది.జాతీయ స్థాయిలో పార్టీ అంటే అంతా ఆషామాషీ వ్యవహారం కాదనేది కేసీఆర్కు సైతం తెలియనిది కాదు. కానీ ఇప్పుడున్న చిక్కల్లా మరో తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ కేసీఆర్కు పెద్ద సవాలుగా మారనుంది. నిజానికి టీఆర్ఎస్ ఓ ప్రాంతీయ పార్టీ. రాష్ట్ర విభజన కోసం ఆవిర్భవించిన సంస్థ. ఉద్యమ సమయంలో ఇడ్లీ సాంబార్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేసింది టీఆర్ఎస్. ఉద్యమ సమయంలో ఏపీ రాజకీయ నేతలపై, వ్యాపార వేత్తలపై కేసీఆర్ ఒంటికాలితో లేచారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో తిరోగమన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆర్థిక స్థితి కుంటుపడుతోందనే వాదన అక్కిడి పండితులు చెబుతున్నారు. ఇలాంటి నేపథ్యంలో తెలుగు రాష్ట్రం విడిపోవడానికి కారకుడైన కేసీఆర్ ఇచ్చే పిలుపును ఏపీ ప్రజలు ఏ మేరకు అంగీకరిస్తారనేది తెలియాల్సి ఉంది. బీఆర్ఎస్ ద్వారా అందరం కలిసి జట్టుగా ఉందామంటే కలిసి వచ్చే పార్టీలు ఎన్ని, మద్దతు చెప్పే నేతలు ఎంత మంది అనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికే ఏపీ కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ ప్రతిపాదనపై భగ్గుమంటున్నారు. కేసీఆర్ను నమ్మబోమని వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పక్కనున్న ఏపీ ప్రజల మెప్పు పొందడం కేసీఆర్కు కత్తిమీద సాములా మారే అవకాశం ఉందంటున్నారు రాజకీయ పండితులు.

## సివిల్ సప్లై హమాలీల రేట్లు పెంచాలి

**ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్**



ఆసిఫాబాద్ జిల్లా జూన్ 14(ప్రజాపాలన, ప్రతినిధి) :తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న సివిల్ సప్లై హమాలీ కార్మికుల ఒప్పందం రేట్లు ముగిసి 6నెలలు అయినప్పటికీ ప్రభుత్వం నూతన రేట్లు అమలు చేయడం లేదని, వెంటనే నూతన రేట్లను అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో హమాలీ కార్మికుల సమావేశంలో ఉపేందర్ మాట్లాడుతూ ఈనెల 16న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఉదయం 11 గంటలకు జరిగే సివిల్ సప్లై అమాలి కార్మికుల ధర్నా ను విజయవంతం చేయాలని కోరారు. కార్మికుల డిమాండ్లు సమాధి కార్మికుల రేట్లు రూ30 పెంచాలని, బోనస్ 10 వేలు ఇవ్వాలని, జీవో ప్రకారం ఈఎస్ఐ సౌకర్యం కల్పించి, మహిళా స్వీకర్ లకు నెలకు రూ 10 వేలు ఇవ్వాలని, తదితర హక్కుల సాధన కై ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సివిల్ సప్లై వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్టుపల్లి సుధాకర్, కార్యదర్శి హేమాజీ,నాయకులు దివాకర్, శ్రీనివాస్,కొమురక్క, ప్రకాష్, లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## పలు గ్రామాల్లో పర్యటించిన టీఆరెఎస్ పార్టీ జిల్లా నాయకులు డా.కోట రాంబాబు



మధిర రూరల్ జూన్ 14 ప్రజా పాలన ప్రతినిధి నియోజకవర్గ పరిధిలో టిఆర్ఎస్ నాయకులు కె.వి.ఆర్ హాస్పిటల్ అధినేత కోటా రాంబాబు పలు కార్యక్రమాల్లో మధిర లోని శిద్దారెడ్డి బజారు నందు డా. మూడ్ రవిచంద్ , మాజీ జెడ్పీటీసీ ప్రియాంక నూతన గృహప్రవేశ మహోత్సవానికి హాజరై వారికి శుభాకాంక్షలు తెలియచేశారు. మహాదేవపురం గ్రామంలో మిరియాల శివాజీ, మేఘన ల వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎర్రుపాలెం మండలం రేమిడిచర్ల గ్రామంలో చింతిరాల మానస, కోటేశ్వరరావు ల వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మామునూరు గ్రామంలో ఇటీవలే రోడ్ ప్రమాదంలో గాయపడిన కానిస్టేబుల్ డొక్కా శ్రీను కాలికి ఆపరేషన్ జరగగా వారిని పరామర్శించి వారి ఆరోగ్య వివరాలు తెలుసుకోనున్నారు. మీనవోలు గ్రామంలో ఖంబంపాటి కిరణ్ కి ఇటీవలే గుండెకు ఆపరేషన్ జరగగా వారిని పరామర్శించి వారి ఆరోగ్య వివరాలు తెలుసుకోనున్నారు. వారు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు వివరించి ధైర్యం చెప్పారు. మండలం మడుపల్లి గ్రామంలో నిన్న మరణించిన ఏసీ మెకానిక్ గౌసుద్ధిన్ మృతికి చింతిస్తూ వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమాలలో మీనవోలు గ్రామ ఎంపిటిసి మల్లికార్జున్ రెడ్డి , మామునూరు గ్రామ టీఆరెఎస్ పార్టీ అధ్యక్షుడు చిన్న వెంకటేశ్వర్లు , పురుషోత్తం , మన్నే నరసింహారావు, బాలాజీ , గుండ్ల రత్నబాబు , రవీంద్ర , దావీదు , ఏసురత్నం, తిమోతి, సతీష్, నంద్రు శ్రీను సలీం తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంఘం ఆధ్వర్యంలో తాసిల్దార్‌కు వినతిపత్రం



ఇబ్రహీంపట్నం జూన్ 14 ప్రజాపాలన ప్రతినిధి :తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పిలుపు లో భాగంగా యాచారం రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో యాచారం తహసీల్దార్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి మెమోరాండం అందించడం జరిగింది ఈ కార్యక్రమం లో రైతు సంఘం జిల్లా కార్యదర్శి %దీ%. మధుసూదన్ రెడ్డి హాజరై మాట్లాడుతూ వానకాల సీజన్ ప్రారంభం అవుతున్నప్పటికి రాష్ట్ర ప్రభుత్వం తగినన్ని విత్తనాలను అందుబాటులో ఉంచలేదన్నారు పైగా రోజుకోచోట నకిలీ విత్తనాలు బయట పడుతున్నాయి వాటి పై కఠిన చర్యలు తీసుకోవాలి. మరియు రుణ మాఫీ చేస్తామని ఇప్పటికి చెయ్యలేదు కనుక తక్షణమే రుణ మాఫీ చేసి కొత్త రుణాలు మంజూరు చెయ్యాలి. మండలం లోని కౌలు రైతులను ఆదుకోవాలని వీరికి రైతు బీమా గాని, రైతు బంధు గాని, రైతు రుణమాఫీ గాని వీరికి వర్తింప చెయ్యాలి. పైగా కౌలు రేటు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఇతర పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగాయి ఈ ఫలితంగా అనేక మంది కౌలురైతులు ఆత్మ హత్య లు చేసుకుంటున్నారు కనుక రాష్ట్ర ప్రభుత్వం ఈ రైతు లకు స్కింలన్నీ వర్తింపచెయ్యాలి. ధరణి పోర్టల్ లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని. పోడ్రీరైతులను ఆదుకోవాలని. పాడిరైతు లను ఆడుకోవాలని వానాకాలం సీజన్ లో పశువులకుగాని, గొర్రెలు, మేకలకు గాని సరియైన సమయానికి మందులు గాని టీకా గాని వేయాలని ఇంకా అనేక సమస్యలను గుర్తించి వాన కాల సమయంలో అన్నీ అందుబాటులో ఉంచాలని యాచారం రైతు సంఘం డిమాండ్ చేస్తుంది ఉంచని యెడల పెద్ద ఎత్తున మరో ఉద్యమం చేపడతామని తెలిపారు ఈ కార్యక్రమంలో యాచారం రైతు సంఘం మండల కార్యదర్శి ఎంపీ నరసింహ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బ్రహ్మయ్య వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు సత్యం ధర్మన్నగూడ సర్పంచ్ భాష య్య భాశయ్యా రైతు సంఘం నాయకులు లిక్కి మధుకర్ రెడ్డి వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# రాపల్లిలో బాహాబాహీకి తలపడిన ఇరు వర్గాలు

## పోలీసుల వాళ్లతో సద్దుమణిగిన ఘర్షణ




బోనకల్, జూన్ 14 ప్రజాపాలన ప్రతినిధి : మండల పరిధిలోని రాపల్లి గ్రామంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. గత కొంత కాలంగా గ్రామంలో నెలకొన్న రాజకీయ పరిణామాలే ఈ ఘర్షణ కు కారణమని తెలుస్తుంది. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత రెండు వర్గాలు ఘర్షణకు తలపడే పరిస్థితి రావడంతో గ్రామస్తులలో కొంత ఆందోళన నెలకొంది. టిఆర్ఎస్ పార్టీకి కంచు కోటలా ఉన్న ఈ గ్రామంలో సర్పంచ్ మందడపు తిరుమలరావు వైఖరితో పార్టీలో అంతర్గత విభేదాలు ఏర్పడి పలువురు సర్పంచ్ ను వ్యతిరేకించడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో పాలక వర్గ సభ్యులైన ఏనుగు రవికుమార్, కొండపనేని రాధాకృష్ణ తదితరులు సోమవారం సీపీఐ లో చేరారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ గా ఉన్న మందడపు తిరుమలరావు గ్రామ పంచాయతీ నిధులను ఇష్టానుసారంగా సొంతానికి వాడుకోవడం పాలక వర్గ సభ్యులు, గ్రామస్తులు ఎన్నిసార్లు అడిగినా లెక్కలు చెప్పకపోవడం నిధుల దుర్వినియోగం పై ప్రశ్నించిన వారిపై దాడులు చేయించే ప్రయత్నం చేయడంతో 95 శాతం టీఆర్ఎస్ గా ఉన్న గ్రామంలో సర్పంచ్ పై తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల క్రితం తనను ప్రశ్నించాడన్న నేపంతో సోమవారం రాత్రి గంగదేవులు కృష్ణపై దాడి చేసేందుకు సర్పంచ్ వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు మాటువేశారు. ఈ సమాచారం తెలుసుకున్న కృష్ణ బంధువులు అక్కడకు చేరుకుని ఘర్షణను నివారించి మంగళవారం తిరిగి కూర్చుని మాట్లాడుకుందామని ఇరు వర్గాలు ఓ ఆలోచనకు వచ్చాయి. ఆ తర్వాత మంగళవారం ఉదయం 10 గంటలకు సర్పంచ్ మందడపు తిరుమలరావు తన అనుచరులతో వచ్చి ఒకరిద్దరు వ్యక్తులపై దాడి చేసేందుకు ప్రయత్నించడంతో గ్రామస్తులు సర్పంచ్ వర్గానికి ఎదురు తిరిగారు. ఇరు వర్గాలు బాహాబాహీకి తలపడ్డాయి. ఆ సమయంలో పోలీసులు హుటాహుటిన గ్రామానికి చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ అవినీతికి మారుపేరుగా మారారని వివిధ రూపాలలో గ్రామ పంచాయతీ నిధులతో పాటు హరితహారం, ఇతర నిధులను తన సొంతానికి వాడుకున్నారని ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడుతున్నారని సర్పంచ్ ప్రత్యర్థి వర్గీయులు ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయతీ లెక్కలు అడిగిన ప్రతిసారి గ్రామంలో ఉద్రిక్త వాతావరణం సృష్టించడం, బెదిరించడం చేస్తున్నారు. మూడేళ్లుగా గ్రామంలో ఇదే తంతు కొనసాగుతుందని వారు ఆరోపించారు. ఆధారాలతో సహా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా తిరుమలరావు వైఖరిపై టిఆర్ఎస్ పార్టీలోనూ తీవ్ర చర్చ నడుస్తుంది. జిల్లా నాయకునిగా ఉన్న వ్యక్తికి సర్పంచ్ గా ఎంపిక చేసే బలమైన గ్రామాన్ని అప్పగిస్తే చివరకు గ్రామంలోనే పార్టీ ఉనికి ప్రశ్నార్థకమయ్యేలా వ్యవహరిస్తున్నారని మండల నాయకులు తలపట్టుకుంటున్నారు. ఎప్పుడు ఎవరిపై ఉంటారో ఏమీ చేస్తాడో అర్థం కానీ స్థితి ఏర్పడిందని ఓ మండల నాయకుడు వ్యాఖ్యానించాడు. టిఆర్ఎస్ వర్గ పోరులో రెండు పడవల పై కాళ్లు అన్న చందంగా వ్యవహరించిన సర్పంచ్ రాపల్లి గ్రామానికి వచ్చి టిఆర్ఎస్ పార్టీని ముఖ్యంగా కేసీఆర్, కేటిఆర్ తీవ్ర పదజాలంతో విమర్శించిన వైఎస్ఆర్ టీపి అధినేత వైఎస్ షర్మిలకు ఎదురెల్లి స్వాగతం పలికి టిఆర్ఎస్ శ్రేణులను ఆశ్చర్యపరిచాడు. ఇప్పుడు లెక్కలు అడిగిన వ్యక్తులపై తనకు మిగిలిన కొద్ది మంది అనుచరులతో దాడి చేయించేందుకు సిద్ధమవుతున్నాడు. మొత్తం గ్రామ పంచాయతీ నిధుల వినియోగం పై పూర్తి విచారణ జరపాలని, తరచూ దాడులకు ప్రేరేపిస్తున్న సర్పంచిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరించాలి: జిల్లా ఎస్పీ కే సురేష్ కుమార్




ఆసిఫాబాద్ జిల్లా జూన్ 14 (ప్రజాపాలన, ప్రతినిధి) : జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల ముఖ్య అధికారులతో జిల్లా ఎస్పీ కే సురేష్ కుమార్ శాంతిభద్రతలపై నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా పోలీస్ స్టేషన్ల వారీగా నమోదైన కేసులో దర్యాప్తు అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కేసుల దర్యాప్తులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ప్రణాళికాబద్ధమైన వ్యూహం పోలీస్ అధికారులు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ప్రస్తుతం అన్నా నేరాలను కాకుండా కాలానుగుణంగా సమాజంలో ఉద్యమించిన నేరాలతో అప్రమత్తంగా ఉండి అది కట్టేందుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన వ్యవస్థ పోలీస్ వ్యవస్థ అని 10 పోలీస్ ఒక రక్షకుడని ఈ సందర్భంగా తెలిపారు. ముఖ్యంగా గంజాయి, నకిలీ పత్తి విత్తనాలు, అంతమొందించే దిశగా కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనపరిచిన వర్టికల్ అధికారులకు క్యాష్ రివార్డ్ అందించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ అడ్మిన్ అచ్చేశ్వర్ రావు, అదనపు ఎస్పీ ఏ ఆర్ భీమ్రావు, డిఎస్పి లు, పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అన్నదమ్ముల్ల ఆస్తుల భూమి వివాదం యువకుడి మరణానికి దారితీసింది



వైరా, ప్రజాపాలన ప్రతినిధి: తమ తల్లిదండ్రుల ఆస్తి కోసం అన్నదమ్ములు గత కొంతకాలంగా ఆస్తులు పంచుకునే విషయంలో వివాదాలకు దారితీశాయి ఆస్తుల వివాదం పరిష్కారం గాక తమ్ముడిని వేధింపులకు గురిచేయడంతో మెండె శ్రీనివాస్ అనే యువకుడు మార్చి 28 వ తేదీన మనస్తాపంతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు తమ్ముడు ఆత్మహత్య సంఘటన బయటకు పొక్కనీయకుండా కుటుంబీకులు అన్నదమ్ములు గుట్టుచప్పుడు కాకుండా అంత్యక్రియలు నిర్వహించిన సంఘటన ఖమ్మం జిల్లా వైరా మండలం రెబ్బవరం గ్రామంలో చోటుచేసుకుంది కుటుంబ ఆస్తుల వివాదం లో తన భర్త మరణానికి కారకులైన మొండెం ఇషాక్ బాబు కుటుంబ సభ్యులపై ఫిర్యాదు చేయడంతోపోస్టుమార్టం నిర్వహించిన రెవెన్యూ అధికారులు పోలీసులు ఖమ్మం జిల్లా వైరా మండలం రెబ్బవరం గ్రామానికి చెందిన మొండెం శ్రీనివాస్ కు తన అన్నదమ్ములైన మొండెం జయరాజు మొండెం ఇసాక్ బాబులకు తమ తల్లిదండ్రుల ఆస్తుల భూమి వివాదంలో గొడవలు జరుగుతున్నాయి ఈ వివాదాల విషయంలో పెద్ద మనుషుల మధ్య చర్చలు జరిగినా పరిష్కారం కాకపోవడంతో తన అన్న మొండెం ఇసాక్ బాబు కుటుంబ సభ్యులు వేధింపులకు గురి చేయటం వల్ల ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు తమ్ముడు శ్రీనివాస్ మృతి చెందిన సంఘటనను పోలీసులకు సమాచారం అందించకుండా శ్రీనివాస్ భార్య సంపూర్ణ ను అనారోగ్యంతో ఉండటంతో అకస్మాత్తుగా మృతి చెందారని నమ్మించి ఈషాక్ బాబు కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు .గత కొంత కాలం తర్వాత శ్రీనివాస్ మృతి చెందిన ఇంటిలో శ్రీనివాస్ భార్యకు మరణ వాంగ్మూలం లెటర్ దొరకటంతో ఆ లెటర్ పోలీసులకు సమాచారం అందించి తన భర్త మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్టేషన్లో ఫిర్యాదు చేసింది ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు రెవెన్యూ అధికారులు ప్రభుత్వ వైద్యాధికారితో పోస్టుమార్టం నిర్వహించారు శ్రీనివాస్ భార్య సంపూర్ణ ఫిర్యాదు మేరకు శ్రీనివాస్ మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్సై వీర ప్రసాద్ తెలిపారు

# దారిలోకొచ్చిన ధరణి సమస్య..

(మొదటి పేజీ తరువాయి)

ఇంకా మరో 12కుపైగా తీవ్రమైన సమస్యలు ధరణిలో ఉన్నాయి. ఇవి రైతులకు ఇబ్బందిగా పరిణమించాయి. గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఆప్షన్ 33లో పట్టాదార్ పాస్ పుస్తకాల్లో తప్పులను సరిచేసుకునే వెసులుబాటును అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో పేరు మార్పు, భూమి స్వభావం మార్పు, భూమి వర్గీకరణ మార్పు, భూమి రకం మార్పు, పరిధి దిద్దుబాటు, మిస్సింగ్ సర్వే నెంబర్, మిస్సింగ్ డివిజన్ నెంబర్ చేర్పు, నోషనల్ ఖాతా పేరుతో ఉన్న వాటిని సరిచేసే చర్యలు, వాటినుంచి పట్టా భూమిగా మార్పు, భూమి అనుభవం కాలంలో మార్పులకు ఈ కొత్త ఆప్షన్ అందుబాటులోకి తెచ్చింది. తద్వారా లక్షలాది మంది రైతుల సమస్యలకు పరిష్కారం దొరకనుంది.కాగా సబ్ కమిటీ గుర్తించిన 40 సమస్యల్లో కేవలం పాస్ పుస్తకాల్లో తప్పుల సవరణకు మాత్రమే గత నెలలో ప్రభుత్వం అవకాశమిచ్చింది. సిద్దిపేట జిల్లా ములుగులో 2200మందికిపైగా రైతులు ఉండగా, 200లకుపైగా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. ఆయా సమస్యలు, వాటి వర్గీకరణ, తీరు తెన్నులు, పరిష్కార మార్గాలు, అధికారులు తీసుకున్న చర్యలను పరిశీలించారు. పాస్ పుస్తకాల్లో తప్పులు, సర్వే నెంబర్లలో నమోదు కాని భూమి, నిషేదిత జాబితాలో పడిన భూములు, వ్యవసాయేతర భూముల కన్వర్షన్, గజాల్లో మ్యుటేషన్ల సమస్యలు, వారసత్వ బదలీలు, సాగులో ఉన్న భూమి వ్యవసాయేతర భూమిగా రికార్డుల్లో పడటం, మైనర్ల ఫోటోలు పాస్ పుస్తకాల్లో లేనితీరు, అసైన్డ్, ఇనాం తదితర భూముల హక్కులు, మ్యుటేషన్‌కు ముందే భూ యజమాని మరణించిన సందర్భాలు వంటివాటిని పరిశీలించారు. త్వరలో మరో 7 ఐచ్చికాలతో ల్యాండ్ ఓనర్ ఫ్రెండ్లీ ధరణి దిశగా సర్వం సిద్ధమైంది. ధరణి సమస్యలను నివారించి మరింత సౌకర్యవంతంగా రైతాంగానికి మేలు చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్ ఆదేశాలతో అధికారులు చురుగ్గా శ్రమిస్తున్నారు. 40 రకాల సమస్యల నివారణకు 7 కొత్త ఆప్షన్‌లను రూపొందించిన అధికారులు కీలక నిర్ణయం తీసుకోనున్నారు.అసలు పట్టాదారును గుర్తించేందుకు తీసుకోవాల్సిన మార్గదర్శకాలు, వేరే వ్యక్తుల పేర్లతో ఉన్న భూములను ఇతరులకు మార్చితే కల్గే న్యాయపరమైన ఇబ్బందులు, ఈ నిర్ణయాధికారం ఎవరికి ఇవ్వాలి%ొా%వాస్తవ భూమికి, ధరణిలో నమోదైన భూమికి మధ్య ఉన్న విస్తీర్ణం వ్యత్యాసాల సరిజేత, పట్టా భూములను నిషేదిత జాబితాలోనుంచి తొలగించడం, స్వాతంత్ర్య సమరయోధులు, సైనికులకిచ్చిన భూములు, సవరణ అధికారం వంటి అంశాలను పరిశీలిస్తున్నారు. భూమి రకం, వినియోగ మార్పులు, మిస్సింగ్ సర్వే నెంబర్ల చేర్పులు, ఒకరికంటే ఎక్కువమంది క్రయ విక్రయదారుల పేర్ల చేర్పు వంటి వాటిలో రెండు ఆప్షన్లు ఉన్నాయని మరో 5 మ్యాడ్యూల్స్ అతి త్వరలో అందుబాటులోకి తేనున్నారు. ఈ వివరాలతో దరణి పోర్టల్‌ను మరింత సరళంగా మార్చి, సమస్యలను సులభంగా పరిష్కరించి ప్రజలకు మేలు చేసేలా కార్యాచరణ ముమ్మరంగా జరుగుతోంది.

## సారో పాఖ్యానం

తాగొద్దనే నాయాళ్ళు
తాగుడంగళ్ళనెడతారు
తాగుడంగళ్ళకెడతారు
అక్కడ లైన్లో నిలబెట్టిన లాఠీ
తాగి బండి నూకితే సాలు
నోటికాడ మిసనెట్టీసి
ఉఫ్...ఉఫ్ మని ఊదమంతది
కూ... కూ... అనడమే తడుం
బిల్లు సేతిలో పెట్టి
పైసలు కట్టమని యాగీసేత్తంది
లేదంటే బొక్కలో తోత్తంది...
పైసల్లేవు బాబూ
నన్నొగ్గీమంటే
బండి నొగ్గేసి
కోర్టుకొచ్చి ఫైను కట్టి
తీసుకెల్లు అంతారు
కాకుంటే లాఠీ ఇరగతంతారు...
ఈ మరమమేందో పెరుమాల్ల కెరుక!
నాలాంటి నాయాల్లకి
తాగుడే ఎరుక...
నా సొమ్ముతో నేతాగితే తప్పేటి
సారో అంతే...
ఓసోసి లాపాయింటు
బొక్కలో తోత్తానొరేయ్ అంతారు...
తాగి బండి తోలితే
గుద్ది సంపుతానంత
కూసేపు అదీ సత్తెమే ననుకో
పోతే వొంటి పేనమే కదా పోద్ది...
మరి తప్పుడు సన్నాసులు
పైసలిచ్చి, తాగుడోసి మరీ ఓటు
గుద్దిచ్చుకున్నప్పుడు
ఎన్ని బతుకులు ఏమారతాయో
ఎవుడు సెబుతాడు?
అసలు తాగుడుపోయించి
ఓట్లు గుంజుకొనే ఎదవలననాలా
తాగి ఓట్లేసిన సన్నాసులననాలా
తాగుడు మీద బతుకుతున్న
ప్రభుత్వాలననాలా
సిగ్గులేని నాయకులననాలా
నాలాటోడు
ఎవుణ్ణనేట్నాబం
గొప్పోడి మరమాలు
నాకేటి తెల్సు...
కూసింత సుక్కేసి తొంగుంతే
కోటీశుడే సాలడు నాకు

**బంగారు వి బి ఆచార్యులు**
**98495 79569.**




"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?
ప్రశ్న మాది - లక్ష మీది

నేటికీ సమాజంలో గౌతమ బుద్ధ , జ్యోతిరావు పూలే, డాక్టర్ అంబేద్కర్, బాబు జగజీవన్ రామ్, బీ పీ మండల్ , షేక్ ఫాతిమా, సురవరం ప్రతాపరెడ్డి , త్రిపురనేని రామస్వామి చౌదరి , రఘుపతి వెంకటరత్నం నాయుడు మొదలగువారు అంటే ఎవరో అని తెలియని వాళ్ళు ఉన్నారు. ఈ మధ్య కాలంలో కొందరు రాజకీయ నాయకులు బహుజన మహనీయుల చిత్రపటాలను చూసి ఎవరు వీళ్ళు అని ప్రశ్నించిన సందర్భాలు నెలకొన్నాయి.

మన బహుజన సామాజిక స్ఫూర్తిదాతల చరిత్ర, ఉద్యమ స్ఫూర్తి మరుగున పడిపోవడంవల్ల భావితరాలకు స్ఫూర్తి మరియు దేశాభివృద్ధిలో పురోగతి ఉండదు. అందువల్ల అన్ని కులాలలోని మహానుభావుల చరిత్రను ప్రపంచానికి తెలియచెప్పాలనే ఉద్దేశంతో పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో మాస్టర్ కీ టీవీ (అంబేద్కర్ టీవీ) ఛానల్ లో

"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?"
ప్రశ్న మాది - లక్ష మీది

అనే ఒక సరికొత్త ప్రోగ్రాం ను ప్రారంభించబోతున్నాం.

ఈ కార్యక్రమానికి నాంది పలుకుతూ స్పాన్సర్ చేసిన వారి వివరములు :

| | |
|---|---|
| 12.పర్లపల్లి చారిటబుల్ ట్రస్ట్ | Rs 5000/- |
| 13.ఓగూరి నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్, | Rs 5000/- |
| 14.కుసుమ కమల రత్నం మెమోరియల్ ట్రస్ట్ | Rs 2000/- |
| 15. రత్నశ్రీ పార్స్ ఏపీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ | Rs 2000/- |

స్పాన్సర్ చేసిన వారికి ధన్యవాదములు

ఈ ప్రోగ్రాంకు స్పాన్సర్ చేయదలిచిన వారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించగలరు

మా అకౌంట్ వివరాలు :

Cell No. 9154958315

మీరు Sponsorship amount ను Jai B Bhoomi News Channel Limited - A/c. No: 38072051879 , IFSC : SBIN0005893, State Bank of India,Bazarghat Branch,Hyderabad
అకౌంట్ కు పంపించిన కౌంటర్ ఫైల్ తో పాటు మీ వివరాలు పోస్ట్ ద్వారా లేక masterkeytv234@gmail.com ఈ మెయిల్ కు పంపించగలరు.

ప్రజాపాలన

సంపాదకీయం

బుధవారం 15, జూన్ 2022

## పెట్టుబడులకు గమ్యస్థానం

ప్రపంచ దిగ్గజ సంస్థలకు హైదరాబాద్ నగరాన్ని గమ్యస్థానం చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వ ప్రయత్నాలుసఫలీకృతమవుతున్నాయి. పెట్టుబడులను తీసుకురావడానికి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు చేస్తున్న కృషిఫలిస్తున్నది. తాజాగా, అమెరికా, యూకే, దావోస్ పర్యటనలతో కేటీఆర్ రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులను తీసుకువచ్చారు. వివిధ దేశాలకు చెంది న దిగ్గజ సంస్థలు నగరంలో పెట్టుబడులు పెట్టడానికి, తమ కార్యకలాపాలు ప్రారంభించి, ఉత్పత్తులు చేయడానికి ముందుకురావటం గమనార్హం. హైదరాబాద్‌ను విశ్వనగరంగా మార్చాలనే ధృడ సంకల్పం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లది. అందులో భాగంగానే పెద్ద ఎత్తున యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాల ని సంకల్పించారు. ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న, అభివృద్ధి చెందుతున్న రంగాలను, భవిష్యత్‌లో మరింత విస్తరించేందుకు హైదరాబాద్ నగరాన్ని కేరాఫ్‌గా మార్చాలని భావిస్తున్నారు. పెట్టుబడులకు అనువైన పరిస్థితులను కల్పిస్తున్నారు. ఈ పోటీ ప్రపంచంలో అన్నిదేశాలూ తమ వద్ద కే పెట్టుబడులు తీసుకుపోవాలని, పరిశ్రమలను ఏర్పాటుచేయాలని ప్రయత్నిస్తాయి. ఈ పరిస్థితు ల్లో పోటీని ఎదుర్కొని అంతర్జాతీయ దిగ్గజ సంస్థలను హైదరాబాద్‌కు తీసుకురావడం తేలికైన విషయం కాదు. మన ప్రభుత్వ పారదర్శక, ప్రగతిశీల విధానాలు, పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఇస్తున్న రాయితీలు, అనువైన వాతావరణం, మెరుగైన మౌలిక సదుపాయాలు ఇలా అనేక సానుకూలంశాలు తెలంగాణ సొంతం. వీటన్నింటినీ వివరించి, ఒప్పించి పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడంలో కేటీఆర్ విజయవంతమవుతున్నారు. గత ఎనిమిదేండ్లుగా రాష్ట్రానికి పెట్టుబడుల వరద పారుతున్నదంటే, అంతర్జాతీయ దిగ్గజ సం స్థలు వస్తున్నాయంటే అందులో కేటీఆర్ కృషి ఎంతో ఉన్నది. అమెజాన్ సంస్థ ప్రపంచంలోనే అతిపెద్ద క్యాంపస్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది. గూగుల్, ఫేస్‌బుక్, మైక్రాన్, యాపిల్, క్వాల్కమ్, ఊబెర్, సేల్స్‌ఫోర్స్, నోవార్టిస్ వంటి సంస్థలు హైదరాబాద్‌లో తమ రెండో అతిపెద్ద కార్యాలయాలను ఏర్పాటుచేశాయి. కేటీఆర్ ఇటీవల చేసిన అమెరికా, యూకే, దావోస్ పర్యటనలే ఇందుకు తాజా ఉదాహరణ. ఈ పర్యటనల్లో రాష్ట్రానికి కొత్త సంస్థలు వచ్చేందుకు ఎంవోయూలు చేసుకున్నాయి. వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. ఇటీవల అమెరికా పర్యటనకు వెళ్లిన కేటీఆర్ సుమారు 35 సమావేశాల్లో పాల్గొన్నారు. చర్చల అనంతరం ఎడ్వెంట్ సంస్థ ఫార్మా రంగంలో రూ. 1,750 కోట్లు, న్యూజెర్సీ కేంద్రంగా పనిచేసే స్లేబ్యాక్ ఫార్మా రూ. 1,500 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువచ్చాయి. అమెరికా పర్యటనలో మొత్తం రూ. 7,500 కోట్ల పెట్టుబడులను తీసుకురావడంలో కేటీఆర్ సఫలీకృతమయ్యారు. అమెరికా పర్యటన అనంతరం కేటీఆర్ యూకే వెళ్లి అనేకమంది పారిశ్రామికవేత్తలను కలిశారు. ఇంగ్లండుకు చెందిన ఫార్మా సంస్థ సన్ఫేస్ మెజర్మెంట్ సిస్టమ్స్.. అత్యాధునిక ఔషధ పరిశోధనా ల్యాబొరేటరీని హైదరాబాద్‌లో ఏర్పాటుచేయనున్నట్లు ప్రకటించింది. తెలంగాణ ప్రభుత్వం అమ లుచేస్తున్న పారిశ్రామిక విధానాలకు యూకేలో మంచి స్పందన వచ్చింది. టీఎస్ఐపాస్‌ను ఏకంగా బ్రిటన్ వాణిజ్య మంత్రి రణిల్ జయవర్ధన ప్రశంసించారు. ఈ పర్యటనలోనే హైదరాబాద్ ఫార్మా సిటీలో ఏర్పాటుచేయనున్న ఫార్మా యూనివర్సిటీ కోసం తెలంగాణ ప్రభుత్వం లండన్‌లోని ప్రతిష్ఠాత్మక కింగ్స్ కాలేజీతో ఒప్పందం కుదుర్చుకొన్నది. ఇటీవలే దావోస్‌లో జరిగిన కీలకమైన ప్రపంచ ఆర్థిక ఫోరం వార్షిక సదస్సుకు కేటీఆర్ హాజరయ్యారు. దావోస్‌కు ప్రపంచ నలుమూలల నుంచి ప్రభుత్వ పెద్దలు, వ్యాపార, వాణిజ్య సంస్థల ప్రతినిధు లు హాజరవుతారు. అక్కడ వివిధ సంస్థలతో మాట్లాడి కేవలం నాలుగు రోజుల్లో రూ. 4,200 కోట్ల పెట్టుబడులను పెట్టేలా ఒప్పించారు. దావోస్ పర్యటనలోనే ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో రూ. 500 కోట్ల పెట్టుబడి పెడుతున్నట్లు లూలు గ్రూప్ అధిపతి యూసుఫ్ అలీ హామీ ఇచ్చారు. తెలంగాణ నుంచే విదేశాలకు ఆహార ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు యూని ట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కేటీఆర్‌తో చర్చల తర్వాత స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రముఖ బ్యాంకింగ్, ఫైనాన్స్, బీమా రంగ సంస్థ స్విస్రీ హైదరాబాద్‌లో తన కార్యాలయాలన్ని ఏర్పాటుచేయనున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే హైదరాబాద్‌లో ఒక యూనిట్ కలిగి ఉన్న స్పెయిన్‌కు చెందిన కీమో ఫార్మా మరో రూ. 100 కోట్ల పెట్టుబడితో తమ కార్యకలాపాలను విస్తరించనున్నట్లు ప్రకటించింది. ఆశీర్వాద్ పైప్స్ కంపెనీ తెలంగాణలో రూ. 500 కోట్లతో తయారీ కేంద్రా న్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. తెలంగాణలో రైల్‌కోచ్‌ల తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయనున్నట్లు స్విట్జర్లాండ్ సంస్థ స్టాడ్లర్ ప్రకటించింది. ఇందుకుగానూ రూ. వెయ్యి కోట్ల పెట్టుబడిని పెట్టనున్నది. ఇటీవలే హైదరాబాద్‌లో తొలి యూనిట్ ప్రారంభించిన స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రముఖ ఫార్మా కంపెనీ ఫెర్రింగ్ ఫార్మా మరింత విస్తరిస్తూ, హైదరాబాద్‌లో రూ. 500 కోట్లతో రెండో యూనిట్ నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. ఎనర్జీ మేనేజ్‌మెంట్, ఆటోమేషన్ ఉత్పత్తుల తయారీ సంస్థ ష్నైడర్ ఎలక్ట్రిక్ రాష్ట్రంలో కొత్త యూనిట్ ప్రారంభించబోతున్నది. దక్షిణకొరియా కు చెందిన ఆటోమోటివ్ దిగ్గజ సంస్థ హ్యుందాయ్ తెలంగాణలో రూ. 1,400 కోట్ల పెట్టుబడి పెట్టనున్నది. స్వీడన్‌కు చెందిన ఈఎంపీఈ డయాగ్నోస్టిక్స్ సంస్థ రూ. 207 కోట్ల పెట్టుబడిని హైదరాబాద్‌లో పెట్టనున్నది. ఇక్కడినుంచి టీబీ టెస్ట్ కిట్లను తయారుచేసి ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి చేయనున్నది. జర్మనీకి చెందిన ఆటోమోటివ్ దిగ్గజం జెడ్‌ఎఫ్ హైదరాబాద్‌లో తన అతిపెద్ద కార్యాలయాన్ని ఏర్పాటుచేయనున్నది. తెలంగాణను టెక్నాలజీ పవర్ హౌజ్‌గా మార్చడానికి కేటీఆర్ ఎంతగానో కృషి చేస్తున్నారని వర ల్డ్ ఎకనామిక్ ఫోరం అధ్యక్షులు బోర్గ్‌బ్రెండే ప్రశంసించటం ముదావహం. సమర్థుడికి సరైన బాధ్యతలు అప్పగిస్తే ఫలితాలు ఎంత అద్భుతంగా ఉంటాయో కేటీఆర్ రుజువు చేస్తున్నారు.

# బీజేపీయే భారత్ భవిష్యత్తు



'మీఅంతరాత్మ ప్రభోదాన్ని అనుసరించి ఓటు వేయండి..' అని 1969లో అధికార కాంగ్రెస్ అభ్యర్థి నీలం సంజీవరెడ్డిని ఓడించడానికి ఇందిరాగాంధీ పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌లో వృద్ధ నేతలతో కూడిన సిండికేట్ నిర్ణయించిన అభ్యర్థిని ఓడించడానికి ఆమె వివి.గిరిని అధికార అభ్యర్థిగా నిలబెట్టి గెలిపించుకుని పార్టీలో తనదే పైచేయిగా నిరూపించుకున్నారు. ఇవాళ కాంగ్రెస్‌లో వృద్ధులే తప్ప యువకులు మిగలని పరిస్థితుల్లో ఆ పార్టీ నేతలే అదే అంతరాత్మ ప్రభోదాన్ని అనుసరించి దేశ భవిష్యత్తు బిజెపిలోనే ఉన్నదని భావిస్తున్నారు. తాజాగా ముగిసిన రాజ్యసభ ఎన్నికలు ఈ పరిణామాన్ని నిరూపిస్తున్నాయి. 'నా అంతరాత్మ ప్రభోధాన్ని అనుసరించి ఓటు వేశాను' అని హర్యానాలో మాజీ ముఖ్యమంత్రి భజన్‌లాల్ కుమారుడు కుల్దీప్ సింగ్ బిష్ణోయ్ ప్రకటించారు. నాలుగుసార్లు ఎమ్మెల్యే అయిన ఆయన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు. కాని ఆయన బిజెపి మద్దతుతో పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థి కార్తికేయ శర్మకు ఓటు వేయడంతో కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి అజయ్ మాకెన్ పరాజయం పాలయ్యారు. రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడైన ఒక అధికార ప్రతినిధినే గెలిపించుకోలేని దుస్థితిని కాంగ్రెస్ ఎదుర్కొన్నది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు బిష్ణోయ్‌ను కాంగ్రెస్ పార్టీనుంచి బహిష్కరించింది. ఏమి ప్రయోజనం? 'మీ అంతరాత్మ ప్రభోధాన్ని అనుసరించి ఓటు వేయండి..' అని కర్ణాటకలో కాంగ్రెస్ అధ్యక్షుడు డికె శివకుమార్ పిలుపునిచ్చారు. కర్ణాటకలో ఒక సీటుకంటే ఎక్కువ గెలిచే అవకాశాలు లేకపోయినా కాంగ్రెస్ రెండో అభ్యర్థిని నిలబెట్టింది. అదే విధంగా జనతాదళ్ (ఎస్) తమకు ఒక్క సీటు రాదని తెలిసినా తమ అభ్యర్థిని పోటీలో దించింది. బిజెపి తమకు రెండు సీట్లు మాత్రమే వచ్చని తెలిసినప్పటికీ ప్రతిపక్షాలను చిత్తు చేయడానికి మూడో అభ్యర్థితో పోటీ చేయించింది. చివరకు జరిగిందేమిటి? కాంగ్రెస్, జనతాదళ్ (ఎస్)కు చెందిన కనీసం పది మంది ప్రతిపక్ష ఎమ్మెల్యేలు తమ అంతరాత్మ ప్రభోదాన్ని అనుసరించి బిజెపి మూడో అభ్యర్థికి ఓటు వేశారు. బిజెపి అభ్యర్థి విజయావకాశాలను దెబ్బతీయాలనుకున్న కాంగ్రెస్ కుతంత్రాలు ఫలించలేదు. ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మయి, మాజీ ముఖ్యమంత్రి బిఎస్ యడ్యూరప్పతో పాటు బిజెపి నేతలంతా కలిసికట్టుగా వ్యూహరచన చేస్తే కాంగ్రెస్, జనతాదళ్ (ఎస్) శిబిరాల్లో తమ ఎమ్మెల్యేలను కూడా కాపాడుకోలేకపోయారు. మహారాష్ట్రలో కూడా ఇదే జరిగింది. చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు బిజెపికి మద్దతునీయడంతో ఆ పార్టీకి చెందిన మూడో అభ్యర్థి ధనంజయ్ మహాదిక్ విజయం సాధించారు. శివసేన, ఎన్‌సిపి, కాంగ్రెస్‌లతో కూడిన మూడు పార్టీల కూటమి మహారాష్ట్ర వికాస్ అఘాడి విశ్వయత్నం చేసినా బిజెపి అదనపు అభ్యర్థి విజయాన్ని అడ్డుకోలేకపోయారు. 29 మంది ఇతర పార్టీలకు చెందిన ఎమ్మెల్యేల్లో 17 మంది తమ అంతరాత్మ ప్రభోదాన్ని అనుసరించి బిజెపి అభ్యర్థికి ఓటువేశారు. మూడేళ్ల క్రితం ఎన్డీఏ నుంచి వైదొలగి, అధికారం కోసం కాంగ్రెస్, ఎన్‌సిపి వంటి అరాచక శక్తులతో చేతులు కలిపి సిద్ధాంతాలను త్యాగం చేసిన శివసేనకు వారు బుద్ధి చెప్పారు. 2019లో జరిగిన ఈ పరిణామం తర్వాత రాజ్యసభ ఎన్నికల్లో నైతిక విజయం లభించడం బిజెపి నేతల్లో ఆత్మస్థైర్యాన్ని నింపిందనడంలో సందేహం లేదు. కాంగ్రెస్‌లోనూ, ఇతర పార్టీల్లోనూ అంతర్గత విభేదాలు ఈ ఎన్నికల్లో బహిర్గతమయ్యాయి. కాని రాజ్యసభ ఎన్నికలు జరిగిన అన్ని రాష్ట్రాల్లో బిజెపి తన బలాన్ని చెక్కు చెదరకుండా కాపాడుకోవడమే కాకుండా చిన్న పార్టీలు, స్వతంత్రులను తమకు అనుకూలంగా మార్చుకోగలిగింది. కేంద్రమంత్రులు పీయూష్ గోయెల్, నిర్మలా సీతారామన్‌లతో పాటు అనేక బలహీన వర్గాలకు, ఆదీవాసీలకు చెందిన నేతలను కూడా బిజెపి గెలిపించుకోగలిగింది. తెలంగాణకు చెందిన సీనియర్ నాయకుడు, బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్‌ను ఉత్తరప్రదేశ్ నుంచి గెలిపించుకుని దేశంలో వివిధ ప్రాంతాలకు, వర్గాలకు సమాన న్యాయం చేయగలిగిన పార్టీగా నిరూపించుకుంది. లక్ష్మణ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడుగానే కాకుండా గత కొన్ని దశాబ్దాలుగా పార్టీని తెలంగాణలో బలోపేతం చేసేందుకు నిర్విరామంగా కృషి చేశారు. బిజెపిలో పార్టీ కోసం కృషి చేస్తున్న వారికి ఎప్పటికైనా న్యాయం లభిస్తుందనడానికి లక్ష్మణ్‌ను రాజ్యసభకు ఎంపిక చేయడం ఒక ఉదాహరణ. ఆయన ఎంపికతో తెలంగాణలో బలహీనవర్గాలకు ఒక గొప్ప ఉత్సాహాన్ని అందించింది. ఇవాళ తెలంగాణలో పెరిగిపోతున్న బలహీనవర్గాల ఆకాంక్షలకు ప్రతిఫలంగా బిజెపి నిలిచిందనడంలో సందేహం లేదు. దాదాపు అన్ని వర్గాలనుంచీ బిజెపికి ఉధృతంగా లభిస్తున్న మద్దతు కెసిఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వీస్తున్న ప్రభంజనానికి తార్కాణం. తన అవినీతి, బంధు ప్రీతి సామ్రాజ్యం కుప్పకూలిపోయే రోజులు ఆసన్నమవుతున్నాయని కేసిఆర్‌కు అర్థమవుతోంది. ఈ పరిణామాలతో దిక్కుతోచని స్థితిలో పడినందువల్లే కేసీఆర్ జాతీయ స్థాయిలో చక్రం తిప్పుతానంటూ బయలు దేరారు. టీఆర్ఎస్‌ను భారత రాష్ట్ర సమితిగా మారుస్తానని ఆయన ప్రగల్భాలు పలకడం విరాటపర్వంలో ఉత్తర కుమారుడి ఉదంతాన్ని స్ఫురిస్తున్నది. జాతీయ స్థాయిలో గాలిలో కత్తి తిప్పినంత మాత్రాన తెలంగాణ ప్రజలు గత ఎనిమిది సంవత్సరాల కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన వేలకోట్ల అవినీతిని, కుటుంబ ఆధిపత్యాన్ని, అణిచివేతను, అస్తవ్యస్థ ఆర్థిక పరిస్థితులను మరిచిపోతారనుకోవడం, తమకు జీతాలు కూడా సకాలంలో అందడం లేదని వాపోతున్న ఉద్యోగులు కెసీఆర్‌కు అండగా నిలుస్తారనుకోవడం అమాయకత్వం. ఇటీవల రాష్ట్ర రాజధాని నడిబొడ్డున పట్టపగలు ఆరుగురు దుండగులు ఒక అమ్మాయిని కిడ్నాప్ చేయడమే కాకుండా సామూహిక అత్యాచారం జరిపిన తీరు తెలంగాణలో శాంతిభద్రతల పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఉన్నదో స్పష్టం చేస్తున్నది. ఈ రాజ్యసభ ఎన్నికల ఫలితాలు రానున్న రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బిజెపికి ఘనవిజయం సాధించేందుకు ఉపోద్ఘాతమని వేరే చెప్పనక్కర్లేదు. రాజ్యసభలో 1988 తర్వాత ఒక పార్టీ ఇలా వంద సీట్లకు చేరుకోవడం ఒక చరిత్రాత్మక పరిణామం. అనేక మిత్రపక్షాలతో పాటు చిన్న పార్టీలు, స్వతంత్రులు బిజెపి వైపు మొగ్గుచూపుతున్నందువల్ల రాష్ట్రపతి ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి విజయానికి ఎటువంటి ఢోకా ఉండదన్న విషయం స్పష్టమవుతోంది. ఇవాళ ప్రజల అంతరాత్మ ప్రభోధమే నరేంద్రమోదీ సారథ్యంలో కమల వికాసానికి దోహదం చేస్తోంది. ప్రజల అంతరాత్మలో మోదీ, మోదీ అన్న నినాదాలు ప్రతిధ్వనిస్తున్నాయనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

# తగునా ఇది కాంగ్రెస్!

దేశ రాజధాని ఢిల్లీతోపాటు పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ సోమవారం 'సత్యాగ్రహ' ఉద్యమంతో హోరెత్తించింది. 'నేషనల్ హెరాల్డ్' కేసులో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ప్రశ్నించడం ఆ పార్టీకి ఆగ్రహం కలిగించింది. ఇదే కేసులో కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీని కూడా ఈడీ ప్రశ్నించాల్సి ఉంది. అయితే ఆమె అస్వస్థతతో ఆసుపత్రిలో చేరడంతో సాధ్య పడలేదు. దశాబ్దాలపాటు దేశాన్నేలి ఎనిమిదేళ్లుగా అధికారానికి దూరమైన కాంగ్రెస్‌కు సమీప భవిష్యత్తులో గత వైభవం దుర్లభమని పదే పదే రుజువవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆ పార్టీ నిర్వహించిన తాజా ఉద్యమం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈడీ, సీబీఐ, ఐటీ తదితర విభాగాలు అధికార పక్షానికి ప్రత్యర్థులైనవారిని వేధించడం రివాజుగా పెట్టుకున్నాయని చాన్నాళ్లుగా ఆరోపణలున్నాయి. ఆ మాటకొస్తే అధికారంలో ఉండగా ఇలాంటి సంస్కృతికి అంకురార్పణ చేసింది కాంగ్రెస్సే. సర్వోన్నత న్యాయస్థానమే ఒక సందర్భంలో సీబీఐని 'పంజరంలో చిలుక'గా అభివర్ణించాల్సి వచ్చింది. అటువంటి పార్టీకి తమ నేత రాహుల్ గాంధీని ప్రశ్నించడం అభ్యంతర కరం అనిపిస్తోంది. ఏ సమస్యపైన అయినా ఉద్యమించడం ఒక రాజకీయ పక్షంగా కాంగ్రెస్ హక్కు. కాదనలేం. కానీ పోయి పోయి ఎన్నో లొసుగులతో నిండివున్న 'నేషనల్ హెరాల్డ్' కేసు విషయంలో ఇంతగా రాద్ధాంతం చేయడమేమిటన్న సందేహం ఎవరికైనా కలుగుతుంది. 'నేషనల్ హెరాల్డ్' చరిత్ర సమున్నతమైనది. కాంగ్రెస్ సారథ్యంలో సాగుతున్న స్వాతంత్ర్య సమరంలో దేశ ప్రజానీకాన్ని చైతన్యవంతులను చేయడం కోసం ఆ పత్రిక ఆవిర్భవించింది. ఎంతో సదాశయంతో ప్రారంభించిన ఆ పత్రిక చుట్టూ స్వాతంత్ర్య స్వర్ణోత్సవ సంబరాలు సాగుతున్న వర్తమాన తరుణంలో వివాదాలు ముసురుకోవడం బాధాకరమే. కానీ అందుకు పూర్తి బాధ్యత సోనియాగాంధీ, రాహుల్ గాంధీలదే. సుదీర్ఘకాలం నడిచి మూతబడిన 'నేషనల్ హెరాల్డ్', దాని అనుబంధ పత్రికలైన క్వామీ ఆవాజ్ (ఉర్దూ), నవజీవన్ (హిందీ)ల విషయంలో కాంగ్రెస్ వ్యవహరించిన తీరుపై అందరికన్నా ముందు నిలదీసింది బీజేపీ నేతలు కాదు... కేంద్ర మాజీ న్యాయశాఖ మంత్రి శాంతిభూషణ్, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి మార్కండేయ కట్జూ. మేధావులుగా, నైతిక వర్తనులుగా పేరుప్రతిష్ఠలున్న వీరిద్దరికీ బీజేపీపై ఉన్న వ్యతిరేకత ఎవరికీ తెలియంది కాదు. వారి అభ్యంతరాలను కాంగ్రెస్ బేఖాతరు చేసినప్పుడు దీన్ని న్యాయస్థానం వరకూ తీసుకెళ్లింది మాత్రం బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామే. ఆయన 2012లో న్యాయస్థానాన్ని ఆశ్రయించకపోయి ఉంటే ఈ అక్రమాలు వెలుగు చూసేవే కాదు. ఆ దశలోనైనా కాంగ్రెస్ మేల్కొనాల్సింది. అప్పటికి తానే అధికారంలో ఉన్నది కనుక సమగ్ర విచారణకు సిద్ధపడాల్సింది. తప్పని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుని అందరికీ ఆదర్శనీయం కావాల్సింది. కానీ కుంభకోణానికి మూలవిరాట్టులు తల్లీకొడుకులే అయినప్పుడు అదెలా సాధ్యం? 'నేషనల్ హెరాల్డ్' నెహ్రూ కుటుంబ సొంతాస్తి కాదు. 1937 నవంబర్‌లో నెహ్రూ చొరవతో దాదాపు 5,000 మంది స్వాతంత్ర్య సమరయోధులు వాటాదారులుగా ఏర్పడిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్(ఏజేఎల్) అనే సంస్థకు చెందిన పత్రిక. దాదాపు 5,000 కోట్ల ఆస్తులున్న ఆ సంస్థనుంచి తనకు రావాల్సిన రూ. 90.25 కోట్ల బకాయిలను వసూలు చేసుకునే నెపంతో కాంగ్రెస్ చేసిన ఇంద్రజాలం అసామాన్యమైనది. 2010లో రూ. 5 లక్షల మూలధనంతో యంగ్ ఇండియన్ లిమిటెడ్(వైఐఎల్) ఏర్పాటు చేయడమే కాదు... ఆగమేఘాలమీద ఏజేఎల్ ఆస్తులన్నిటిపైనా దానికి హక్కులు దఖలు పరిచేందుకు పథకం సిద్ధం చేశారు. ఏజేఎల్‌కు కాంగ్రెస్ పార్టీ రూ. 90 కోట్ల వడ్డీ రహిత రుణం ఇవ్వడం, ఆ రుణాన్ని వసూలు చేసుకునే హక్కును కేవలం రూ. 50 లక్షలకు వైఐఎల్‌కు కాంగ్రెస్ అమ్మడం, అందుకు బదులుగా ఏజేఎల్‌కున్న ఆస్తులన్నీ వైఐఎల్‌కు దఖలుపడటం ఏడాది వ్యవధిలో చకచకా జరిగిపోయాయి. వైఐఎల్‌లో సోనియా, రాహుల్ గాంధీలకు ఏకంగా 76 శాతం వాటాలుండటం... కాంగ్రెస్, ఏజేఎల్, వైఐఎల్ అనే మూడు సంస్థల్లోనూ కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూ సర్వం తానై వ్యవహరించింది కాంగ్రెస్ సీనియర్ నేత స్వర్గీయ మోతీలాల్ వోరా కావడం దిగ్భ్రమ కలిగిస్తుంది. ఇది ఏజేఎల్‌తోపాటు తమ నేతృత్వంలోని కాంగ్రెస్‌ను కూడా దగా చేయడమే. ఏజేఎల్‌కు 2011 నాటికి మిగిలివున్న 1,057 మంది వాటాదార్లలో ఒకరిగా శాంతిభూషణ్, కట్జూలు ఈ చాటుమాటు వ్యవహారాన్ని ప్రశ్నించారు. తమకు కనీసం నోటీసు ఎందుకివ్వలేదని నిలదీశారు. కానీ కాంగ్రెస్ మౌనంగా ఉండిపోయింది. ఆ తర్వాతైనా సచ్ఛీలతను నిరూపించుకోవాల్సింది పోయి స్టేలు తెచ్చుకుంది. దర్యాప్తును అడ్డుకోజూసింది. స్వాతంత్ర్యోద్యమం పైనా, అందులో కీలకపాత్ర పోషించిన కాంగ్రెస్‌పైనా, ప్రత్యేకించి నెహ్రూ పైనా ప్రస్తుత నాయకత్వానికి ఏమాత్రం గౌరవమర్యాదలున్నా ఇలాంటి సందేహాస్పద వ్యవహారా నికి తెరతీసేదే కాదు. వేలాదికోట్ల ఆస్తులున్న సంస్థను నిలబెట్టడానికి, పత్రికలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన వందలాది కుటుంబాలను ఆదుకోవడానికి చిత్తశుద్ధితో ప్రయత్నించి ఉంటే కాంగ్రెస్ ప్రతిష్ఠ ఇనుమడించేది. అందుకు భిన్నంగా వక్రమార్గంలో పోవాలనుకోవడంతో ఆ పార్టీ నగుబాటుపాలైంది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. జరిగిందేమిటో, అందులో తన నిజాయితీ ఏపాటో కాంగ్రెస్ దేశ ప్రజల ముందుంచాలి. ప్రస్తుత దర్యాప్తు ఏరకంగా కక్ష సాధింపు అవుతుందో నిరూపించాలి. ఆ పని చేయలేకపోతే కాంగ్రెస్ ప్రతిష్ఠ మరింత అడుగంటడం ఖాయం.

## ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా సన్మానం




కోరుట్ల, జూన్ 14 (ప్రజాపాలన ప్రతినిధి):జగిత్యాల జిల్లా కేంద్రంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ రక్త దాన దినోత్సవం సందర్భంగా గతంలో రక్తదాతలను సమన్వయపరిచి (మోటివేషన్) రక్త దాతల ద్వారా రక్తం ఇప్పించినందుకు కోరుట్ల కు చెందిన సామాజికవేత్త, రక్తదాన సంధానకర్త కటుకం గణేష్ ను జగిత్యాల జిల్లా కలెక్టర్ రవి నాయక్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు కటుకం గణేష్ ను అభినందించారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత



రాయికల్, జూన్14 (ప్రజాపాలన ప్రతినిధి): అక్రమంగా తరలిస్తున్న మైతాపూర్ కు చెందిన ఇసుక ట్రాక్టర్ ను గత రాత్రి పట్టుకున్నట్లు రాయికల్ తహసీల్దార్ దిలీప్ నాయక్ తెలిపారు . అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తీసుకొస్తే చట్టపరంగా తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అనుమతులు ఉంటేనే ఇసుకను తీసుకురావాలని,లేనిచో తీసుకురాకూడదని ఇసుక ట్రాక్టర్ యజమానులకు సూచించారు.

## ఏఐ సి సి అధ్యక్షురాలు సోనియా మరియు రాహుల్ కేసులు ఉపసంహరించుకోవాలి: జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ డిమాండ్

యాదాద్రి భువనగిరి జిల్లా 14 జూన్ ప్రజాపాలన:ఏఐసీసీ అధ్యక్షురాలు శ్రీమతి. సోనియా గాంధీ, ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు శ్రీ. రాహుల్ గాంధీని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ...రాజ్యాంగ వ్యవస్థ అయిన ఎన్ఫోర్స్మెంట్ డిపార్ట్ మెంట్ ను వాడుకుంటున్నారు.గతంలో అనగా 2015 లోనే ముగిసిన కేసును మళ్లీ తెరపైకి తీసుకువచ్చి... గాంధీ కుటుంబానికి అక్రమంగా నోటీసులు ఇచ్చి, వారి ప్రతిష్ట కు భంగం కలిగేలా వ్యవహరిస్తుందని చూపారు. ఆ కుటుంబాన్ని వేధింపులకు గురిచేస్తున్న నిరంకుశ, నియంతృత్వ మోడీ ప్రభుత్వ తీరును మార్చుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న కక్షసాధింపు రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తూ పై పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ తరపున హెచ్చరిస్తున్నామన్నారు.

## లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



బోనకల్, జూన్ 14 ప్రజాపాలన ప్రతినిధి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ,బాలసాని లక్ష్మీనారాయణ సిఫార్సు తో జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు చొరవతో మంజూరైన 1,71,500 రూపాయల విలువ గల ఆరు చెక్కులను మంగళవారం ఖమ్మం పట్టణం లోని జిల్లా పరిషత్ చైర్మన్ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా బాలసాని లక్ష్మీనారాయణ, కమల రాజు మాట్లాడుతూ వివిధ రకాల అనారోగ్య సమస్యలతో వైద్యం నిమిత్తం ఖర్చు చేసి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి సీఎం సహాయనిధి ద్వారా సహాయం అందించే సీఎం కేసీఆర్ మనమందరం రుణపడి ఉండాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో బోనకల్ మండలానికి చెందిన టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మత విద్వేషాలు రెచ్చగొట్టే వ్యక్తులపై నిఘా

### ఇంచార్జి డిసిపి మంచిర్యాల్ అఖిల్ మహాజన్ ఐపిఎస్



మంచిర్యాల టౌన్, జూన్ 14, ప్రజాపాలన : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు అన్ని వర్గాల వారు పోలీసులతో సహకరించాలి , సోషల్ మీడియాలో కొంతమంది వ్యక్తులు వీడియో క్లిప్పింగ్స్, గుర్తులను అప్లోడ్ చేసి ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా పోస్టులు పెట్టడం జరిగింది. సోషల్ మీడియా పై , మత విద్వేషాలు రెచ్చగొట్టే వ్యక్తులపై, వారి కదలికలపై నిఘా పెట్టడం జరిగిందని చెప్పారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ డీసీపీ మాట్లాడుతూ సోషల్ మీడియాలో మత కలహాలను సృష్టించే విధంగా మరియు ప్రజా భద్రత ,లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తకుండా ప్రజలు శాంతి యుత జీవనం గడిపేల చూడడం మంచిర్యాల పోలీసుల ప్రధాన లక్ష్యం అన్నారు .చట్టవ్యతిరేక ,ప్రజా శాంతి కి భంగం కలిగించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు.సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలు నమ్మవద్దని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులతో సహకరించాలని కోరారు.

# నారంవారిగూడెంలో యువకుల పై సర్పంచ్ దాడి... మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



అశ్వారావుపేట (ప్రజాపాలన ప్రతినిధి) అశ్వారావుపేట మండలంలోని నారావారిగూడెం గ్రామం నుండి యువజంట వెళ్లిపోయిన ఘటనలో సంబంధం ఉందంటూ స్థానిక సర్పంచ్,కుల పంచాయితీ పెట్టి దుర్భాషలాడుతూ విపరీతంగా కొట్టడంతో మనస్థాపానికి గురైై డిగ్రీ విద్యార్థి కలుపు మందు తాగి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని నారంవారిగూడెం లో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే గత మూడు రోజుల క్రితం నారంవారిగూడెం గ్రామం నుండి యువ ప్రేమ జంట ఊరు నుంచి వెళ్లిపోయిన ఘటనలో కొందరు వ్యక్తులను అనుమానించి కుల పంచాయితీ నిర్వహించారని, ఈ పంచాయతీలో సంబంధంలేని తుమ్మ దుర్గయ్య(లేటు) పోలమ్మ దంపతుల కుమారుడు తుమ్మా భవాని శంకర్, నులకాల పిచ్చయ్య రమాదేవి దంపతుల కుమారుడు నులకాల ముత్యాలరావు, లను గ్రామపంచాయతీ సర్పంచ్ మనుగొండ వెంకట ముత్యం, గ్రామపంచాయతీ కార్యాలయంలో విచారణ పేరుతో దుర్భాషలాడుతూ విపరీతంగా దాడి చేశారని దీంతో మనస్తాపం చెందిన తుమ్మా భవాని శంకర్, (18 సంవత్సరాలు డిగ్రీ విద్యార్థి) పొలంలో దాచి ఉంచిన కలుపు మందు తాగి అపస్మారక స్థితికి వెళ్ళాడని అనంతరం చికిత్స పొందుతూ మరణించాడని కుటుంబీకులు తెలిపారు. విచారణ పేరుతో కుల పంచాయితీ పెట్టించి సంబంధం లేని వారిపై దుర్భాషలాడి దాడి చేయడం వల్లనే కలుపు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడని, ఉదయం నుండి సాయంత్రం వరకు బంధించి ఉంచడం వల్ల ఆకలితో ఉన్న భవాని శంకర్ కు మరింత ప్రమాదం ఏర్పడి మరణించాడని, దీనికి కారణమైన గ్రామపంచాయతీ సర్పంచ్ మనుగొండ వెంకట ముత్యం, ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేసన్తా నారంవారిగూడెం నుండి మృతుని కుటుంబ సభ్యులు బంధువులు మృతదేహాన్ని అంబులెన్స్ లో తీసుకువచ్చి పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంలో మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి ధర్నా చేయాలని ఆలోచించగా ఎస్సై చల్లా అరుణ నేతృత్వంలో పోలీసులు రంగ ప్రవేశం చేసి అనుమానం ఉన్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయండి, మీకు న్యాయం చేస్తాం అంటూ ఆందోళనకారులను ఒప్పించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబీకులు మాట్లాడుతూ మృతుడు తుమ్మ భవాని శంకర్ కు ఎటువంటి సంబంధం లేకపోయినా గ్రామ సర్పంచ్ మనుగొండ వెంకట ముత్యం తన ఇష్టారాజ్యం గా వ్యవహరిసన్తా తప్పుడు పంచాయతీలు పెట్టి దుర్భాషలాడి దాడి చేయడం వల్లనే కలుపు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని, ఇటువంటివి గ్రామంలో అనేకం జరుగుతున్నా, సర్పంచ్ పై గతంలో అనేక ఆరోపణలు ఉన్నా ఎటువంటి చర్యలు పోవడం వల్లనే ఇటువంటివి పునరావృతం అవుతున్నాయని తుమ్మ భవాని శంకర్ మృతికి కారణమైన సర్పంచ్ మనుగొండ వెంకట ముత్యం ను కఠినంగా శిక్షించాలని మృతుని కుటుంబీకులు డిమాండ్ చేశారు.

## చేగువేరా ఆశయసాధనకోసం నేటి యువత ఉద్యమించాలి: షేక్ బషీరుద్దీన్



పాలేరు జూన్. 14 ప్రజాపాలన ప్రతినిధి: డివైఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శుభ వీర 94 వ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రపంచ యూత్ ఐకాన్ చేగువేరా ఆశయాల సాధనకై నేటి యువత ఉద్యమించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవన్లో డివైఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుభవేళ 94 వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేగువేరా చిత్రపటానికి పూలమాలవేసి అలంకరించి నివాళులర్పించారు. అనంతరం డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సత్తెనపల్లి నరేష్ అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ మాట్లాడుతూ పేదరికం, అసమానతలు, నిరుద్యోగం, అంటరానితనం, రోగాలు, కష్టాలు కన్నీళ్లు లేని సమాజం కావాలని చేగువేరా కోరుకున్నారని అట్లాంటి సమాజ నిర్మాణం కోసం నేటి యువత ఉద్యమించాలని షేక్ బషీరుద్దీన్ అన్నారు.నేటి భారతదేశంలో కూడా పేదరికం నిరుద్యోగం దరిద్రం విపరీతంగా పెరిగిపోతున్నాయని, నేడు పాలిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాటల గారడీతో ప్రజలను మోసం చేస్తున్నాయని అందుకే నిజమైన ప్రజల పక్షాన ఉండే పాలకులను ఎంచుకునేలా నేటి యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రజలను చైతన్యం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు కూరపాటి శ్రీను, రావులపాటి నాగరాజు, రాయల శ్రీనివాసరావు, ఆర్టీసీ నాగేశ్వరరావు, నరేష్, ఉపేందర్, సుబ్బారావు, ఉమామహేశ్వరరావు, ప్రవీణ్, అరవింద్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పౌర్ణమి అన్నదానం



మంచిర్యాల బ్యూరో, జూన్ 14, ప్రజాపాలన : మంచిర్యాల వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ప్రతినెల నిర్వహిస్తున్నట్లుగా పౌర్ణమి సందర్భంగా మంగళవారం రోజు మంచిర్యాల రైల్వే స్టేషన్ ముందు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంచిర్యాల వాసవి క్లబ్ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ ముందు పేదలకు రైల్వే స్టేషన్ ద్వారా ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులకు అన్నదానం నిర్వహించారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండగా దాత గడ్డం సూర్య ప్రకాష్ ఉషా కల్యాణి దంపతుల సహకారంతో ఈ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అంతర్జాతీయ సీనియర్ ఉపాధ్యక్షులు రేణికుంట్ల శ్రీనివాస్ , కౌన్సిలర్ మాదంశెట్టి సత్యనారాయణ , వాసవి క్లబ్ అంతర్జాతీయ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కొండా చంద్రశేఖర్ , క్యాబినెట్ కోశాధికారి పుల్లూరి బాలమోహన్ , రీజియన్ చైర్మన్ వుత్తూరి రమేష్, జోన్ చైర్మన్ కాచంసతీష్, వికేయస్పీ జిల్లా ఇన్చార్జి అప్పాల శ్రీధర్, రీజియన్ కార్యదర్శి నాగిశెట్టి శ్రీనివాస్, వాసవి క్లబ్ అధ్యక్షుడు కేశెట్టి వంశీకృష్ణ , కార్యదర్శి నలుమాసు ప్రవీణ్ , సభ్యులు పడకండి శ్రీనివాస్, అల్లంకి మహేష్, రమేష్, చందూరి ప్రభాకర్ , గడ్డం విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సంస్థలో పనిచేసే పర్మినెంట్ కార్మికులను సెక్యూరిటీ గార్డులను నియమించాలి: టీబీజీకేఎస్ నాయకులు ఎం,శ్రీనివాసరావు



బెల్లంపల్లి జూన్ 14 ప్రజా పాలన ప్రతినిధి: బెల్లంపల్లి ఏరియా లో పర్మినెంట్ సెక్యూరిటీ గార్డుల తో పాటు సంస్థలో పనిచేసే జనరల్ మజ్దూర్ లను, సెక్యూరిటీ కోసం నియమించాలని, బెల్లంపల్లి ఏరియా టీబీజీకేఎస్ ఉపాధ్యక్షులు ఎం శ్రీనివాసరావు, కొత్తగూడెం చీఫ్ సెక్యూరిటీ అధికారికి ఆయన విజ్ఞప్తి చేశారు. మంగళవారం బెల్లంపల్లి ఏరియా గోలేటి కి పర్యటన నిమిత్తం వచ్చిన ఆయనకు విజ్ఞప్తి పత్రం అందజేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బెల్లంపల్లి ఏరియా గోలేటి ప్రాంతంలో సింగరేణి గనులు ఎక్కువ విస్తీర్ణంలో విస్తరించి ఉన్నందున, అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కలిగి ఉండడం వల్ల, గతంలో నకిలీ రిసిప్ట్ లు, సమర్పించి బొగ్గును తీసుకెళ్లిన సంఘటనలు జరిగాయని, దానివల్ల సంస్థ నష్టాలకు గురి అయ్యే అవకాశం ఉన్నందున, సంస్థలో పనిచేసే సెక్యూరిటీ గార్డులతో పాటు జనరల్ మజ్దూర్ లను నియమించాలని ఆయన కోరారు.ఇలాంటి సంఘటనలు జరగకుండా, యాజమాన్యం పర్మినెంటు సెక్యూరిటీ గార్డులతోపాటు మరియు రికార్డింగ్ పోస్టుల్లో, పెట్రోలింగ్, టాస్క్ ఫోర్స్, మొబైల్, పార్టీ ల్లో కూడా ప్రైవేటు వారిని నియమిస్తున్నారనీ, ఇదంతా సింగరేణి సంస్థ భద్రతకు ఇబ్బందికరంగా మారుతుందని, అన్నారు. సంస్థలో పని చేస్తున్న పర్మినెంట్ సెక్యూరిటీ గార్డులతో పాటు చదువుకున్న జనరల్ మజ్దూర్ లను ఆయా స్థానాల్లో నియమించాలని ఆయన అన్నారు.రానున్న రోజుల్లో కష్టపడి పనిచేసి తీసిన బొగ్గు, లేదా కంపెనీకి చెందిన విలువైన సామాగ్రి, దోపిడీకి గురయ్యే అవకాశం ఉందని, దానికి కంపెనీ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. కాబట్టి సింగరేణి సంస్థలో పనిచేసే కార్మికులను, సింగరేణి సెక్యూరిటీ విభాగంలో నియమించే ఏర్పాట్లు చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో చర్చల కమిటీ ప్రతినిధి మంగీలాల్, వివిధ డిపార్ట్ మెంట్ల ఫిట్ కార్యదర్శులు, జీయం కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## జయరాని ఉన్నత పాఠశాల విద్యార్థిని జవహర్ నవోదయ కు ఎంపిక



జన్నారం రూరల్, జున్ 14, ప్రజాపాలన: మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రములోని జయరాని ఉన్నత పాఠశాలకు చెందిన కండ్లే అక్షిత తోమ్మిదవ తరగతి నవోదయ ఎంపికై నట్లు పాఠశాల ఎచ్ఎమ్ మదుసూదన్ అన్నారు, మంగళవారం మాట్లాడుతూ నవోదయ ఎంపిక కోసం ధరఖాస్తులు కోరగా ధరఖాస్తు చేసుకున్న అక్షిత పరీక్షల్లో ప్రతిభ కనబరచి సిటు సాధించినట్లు అయన తెలిపారు, ఈ సందర్భంగా అక్షితను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## కన్నుల పండుగగా ముగిసిన శ్రీశ్రీ శ్రీ మల్లికార్జున కేతమ్మల వివాహ మహోత్సవం



ఇబ్రహీంపట్నం జూన్ 14 ప్రజా పాలన ప్రతినిధి :ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని పోల్కంపల్లి అనుబంధ గ్రామమైన మాన్యగూడ లో శ్రీ శ్రీ మల్లికార్జున స్వామి వారి కళ్యాణ మహోత్సవం వేడుకలు ఘనంగా ముగిశాయి. చుట్టుపక్కల గ్రామాల నుండే కాక వివిధ మండలాల నుంచి కల్యాణ మహోత్సవాన్ని తిలకించడానికి అశేష జనం రావడం జరిగింది. అందరి సమక్షంలో కల్యాణ మహోత్సవం మల్లికార్జునుడు సంతోష పడేలా గత 16 సంవత్సరాల నుండి నిర్వహిస్తున్న కళ్యాణ మహోత్సవానికి భక్తి శ్రద్ధలతో టి మల్లికార్జున స్వామి కేతమ్మ ల చరిత్ర ను గత మూడు రోజుల నుండి కళ్యాణ మహోత్సవం మొదలుకొని ఈరోజు వరకు ఒగ్గు కళాకారులు వేషధారణతో జీవిత చరిత్రను ప్రజలకు కనువిందు చేసే విధంగా కళాకారులు కళా రూపం తో కథను తెలిపారు.ఎంతో మంది భక్తులు ఇక్కడికి చేరుకొని వీక్షించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గునుకుల మల్లేష్, మాజీ అధ్యక్షుడు కసరమోని మల్లేష్ యాదవ కురుమ సంఘం ఆలయ కమిటీ సభ్యులు, కుల సంఘాల పెద్దలు , గ్రామస్తులు ఎల్లవేళలా మల్లికార్జున స్వామి కృపా కటాక్షములు దీవించే విధంగా ప్రజలందరిని చూడాలని ఆలయ కమిటీ వేడుక ఉన్నట్లు తెలిపారు.

## మండలంలో మొదలైన ఏరువాక



బోనకల్, జూన్ 14 ప్రజాపాలన ప్రతినిధి: మండలంలోసోమవారం సాయంత్రం మండల వ్యాప్తంగా కురిసిన భారీ వర్షం రైతుల లో ఆనందోత్సవం నెలకొంది. వర్షం కురవడంతో పలు గ్రామాల్లోని రైతన్నలు తమ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే సిద్ధం చేసుకున్న తమ వ్యవసాయ భూముల్లో పత్తి విత్తనాలు నాటడం మొదలు పెట్టారు. వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రత లో ఉండటం ప్రజలు ఈ భారీ వర్షానికి ఉపశమనం పొందారు. వ్యవసాయ పనులు ప్రారంభం సందర్భంగా రైతులు రైతు కూలీలు బిజీబిజీగా తమ పనుల్లో నిమగ్నం అవటంతో గ్రామీణ ప్రాంతాల్లో రైతులు వ్యవసాయ పనులలో విత్తనాలు వేయడం మొదలుపెట్టారు.

## నాలుగు జిల్లాల్లో 94శాతం సిజేరియన్లే

అదిలాబాద్, జూన్ 14,:అదిలాబాద్ జిల్లాలో సిజేరియన్ కాన్పులు ఎక్కువగా జరుగుతున్నాయని, సాధారణ ప్రసవాలపై దృష్టి పెట్టాలని సాక్షాత్తు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు గత మార్చిలో జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్, వైద్యాధికారులు, అంగన్‌వాడీలకు సూచించారు. సిజేరియన్లపై దృష్టి పెట్టాలని సూచించగా, ఆరునెలల్లో మార్పు వస్తుందని కలెక్టర్ సైతం మంత్రికి హామీ ఇచ్చారు. ఈ మేరకు తరచూ వైద్యాధికారులు, అంగన్‌వాడీలతో సమావేశాలు నిర్వహిస్తూ సాధారణ కాన్పులు పెంచాలని కలెక్టర్ సూచిస్తున్నారు. అలాగే జిల్లాలో సిజేరియన్ కాన్పులు ఎక్కువగా నిర్వహిస్తున్న పలు ఆస్పత్రులపై చర్యలు సైతం తీసుకున్నారు. అయినా సానుకూల మార్పు కనిపించడం లేదని వైద్యారోగ్యశాఖ గణాంకాలు స్పష్టం చేస్తుండడం గమనార్హం.రాష్ట్రంలో 2021?22లో సిజేరియన్ ఆపరేషన్లపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ విడుదల చేసిన నివేదికలో నాలుగు జిల్లాల్లో 94శాతం సిజేరియన్లే నమోదైనట్లు వెల్లడైంది. ఇందులో నిర్మల్ జిల్లా మూడో స్థానంలో ఉండడం కలవరపాటుకు గురి చేస్తోంది. ముఖ్యంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లోనే కడుపుకోతలు ఎక్కువగా ఉన్నట్లు నివేదికలో వెల్లడించింది. ఈఏడాది జనవరి నుంచి మే వరకు జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో 2600 వరకు ప్రసవాలు జరుగగా, వీటిలో 2146 సిజేరియన్లే కావడం గమనార్హం. కేవలం 454 సాధారణ కాన్పులు జరిగాయి. అదే ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరిశీలిస్తే.. 2,925 ప్రసవాలు జరుగగా, 1171 సాధారణ, 1754 సిజేరియన్ ప్రసవాలు జరిగాయి. ప్రైవేట్‌తో పోలిస్తే కాస్త మెరుగ్గా ఉ న్నా.. ఇంకా తగ్గాల్సిన అవసరముంది.ఒకప్పుడు సర్కారు దవాఖాన్లలో లేదంటే ఇళ్లలోనే ఎక్కువగా కాన్పులు చేసేవారు. చాలావరకు సాధారణ కాన్పులే జరిగేవి. ఇంటి వద్ద నొప్పులొస్తే మంత్రసాని ఇంటికే వచ్చి ప్రసవం చేసేది. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో మారిన ఆహార అలవాట్ల కారణంగానో, నొప్పులు భరించలేకనో సిజేరియన్ ప్రసవాలకే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. దీంతోపాటు కొందరు సమయం, ముహూర్తం చూసుకుని మరీ ఆపరేషన్లు చేయించుకుంటున్నారు. సిజేరియన్లతో తల్లీబిడ్డ ఇద్దరికీ ప్రమాదమేనని చెబుతున్న ప్రభుత్వం సాధారణ ప్రసవాలపై దృష్టి పెట్టాలని పదేపదే సూచిస్తోంది.కేసీఆర్ కిట్, అమ్మ ఒడి వంటి పథకాలు ప్రవేశపెట్టి మరీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులపై దృష్టి పెట్టింది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం అవగాహన లేకనో, గర్భిణుల బంధువుల ఒత్తిడితోనో సిజేరియన్లు చేస్తున్నారు. సుఖప్రసవానికి వీలులేనప్పుడో, కడుపులో బిడ్డ సరిగా లేనప్పుడో చేయాల్సిన సిజేరియన్లు.. అవసరం లేకున్నా చేస్తున్నారని విమర్శలున్నాయి.


ప్రజాపాలన

**జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.**

**బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు**

| | | | | |
|---|---|---|---|---|
| కడమంచి నారాయణ దాస్ | - | చేవెళ్ల | - | 9849526878 |
| నరోత్తమ్‌రెడ్డి | - | మేడిపల్లి | - | 9346970159 |
| వెంకటస్వామి | - | మంచిర్యాల | - | 9515048103 |
| ఎం. గైబులు | - | వికారాబాద్ | - | 9704570475 |
| టి.రాంబాబు | - | శేర్లింగంపల్లి | - | 6301925113 |
| సత్య కిషోర్ | - | అమీర్‌పేట | - | 6309723472 |
| బోడ మనోహర్ నంద | - | కరీంనగర్ | - | 9492927684 |
| రాజేందర్ ప్రసాద్ | - | ఖమ్మం | - | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | - | మధిర | - | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | - | పాలేరు | - | 9848895405 |
| ఆర్.రాజేశ్వర్ రావు | - | మయూర్ సెంటర్ | - | 9160400339 |
| మాలేడు నరేందర్ | - | ఖమ్మం రూరల్ | - | 8074550397 |
| టిఎస్.చక్రవర్తి | - | ఖమ్మం టౌన్ | - | 9948327333 |
| పసుపులేటి ఈశ్వర్‌తేజ | - | మధిర రూరల్ | - | 6305269141 |
| ఆర్.శ్రీనివాస్ | - | ఎర్రుపాలెం మండలం | - | 8501020885 |
| బుక్య.శ్రీను | - | బోనకల్ | - | 8688810293 |
| సి.మల్లేష్ | - | ఇబ్రహీపట్నం | - | 9618028334 |
| సాయికృష్ణ | - | వైరా | - | 9951486635 |
| దుంపాల రాజేష్ | - | మేడ్చల్ | - | 9000178307 |
| వై.నర్సింహులు | - | తాండూరు | - | 7207677049 |
| డి.ప్రవీణ్ కుమార్ | - | కొడంగల్ | - | 9866027635 |
| టి.సురేష్ చారీ | - | ఆసిఫాబాద్ | - | 9000983108 |
| డి.భాస్కర్ | - | బెల్లంపల్లి | - | 9440018863 |
| ఐ.నర్సింహయ్య | - | జన్నారం రూరల్ | - | 9493314399 |
| గొట్టె సురేందర్ | - | మంచిర్యాల టౌన్ | - | 9248528680 |
| గొర్లబాబూరావు | - | తల్లాడ | - | 9848236015 |


## పతి ఐదువేల ఎకరాల సాగు భూమికి ఒక క్లస్టర్ ను ఏర్పాటు చేయాలి

### వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్





వికారాబాద్ బ్యూరో జూన్ 14 ప్రజాపాలన : ప్రతి ఐదువేల ఎకరాల సాగు భూమికి ఒక క్లస్టర్ ను ఏర్పాటు చేయాలని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మంగళవారం వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మీతో నేను కార్యక్రమంలో భాగంగా బంట్వారం మండల పరిధిలోని నూరుల్లాపూర్ మరియు యాచారం గ్రామాలలో గ్రామ సర్పంచ్ బలవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రాములు యాదవ్ ఉదయం 6:30 గంటల నుండి 10:30 వరకు పర్యటించారు. యాచారం గ్రామంలో మంచిగా పనిచేస్తున్న ఏఎన్ఎం ను మా గ్రామం నుండి బదిలీ చేశారని, మాకు తనే కావాలని ప్రజలు కోరగా ఎమ్మెల్యే వైద్య అధికారులతో మాట్లాడి ప్రజల కోరిక మేరకు ఏఎన్ఎం ను యాచారం గ్రామంలోనే కొనసాగించాలని ఆదేశించారు. సాగు భూమి ఆధారంగా బంట్వారం మండలంలో ఇంకా రెండు వ్యవసాయ క్లస్టర్ లు ఏర్పాటు చేసి ఇద్దరు ఏఈఓ లను నియమించాలని డిఏఓను ఆదేశించారు. నూరుల్లా పూర్ గ్రామంలో మరియు యాచారం గ్రామంలో పాడుబడ్డ ఇండ్లు మరియు పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. గ్రామంలో వంగి ఉన్న విద్యుత్ స్థంబాలను, పంటపొలాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని, విద్యుత్ అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ మంచినీటి నల్లా కనెక్షన్ ప్రతీ ఇంటికి కచ్చితంగా ఇవ్వాలని, గేట్ వాల్వ్ ఏర్పాటు చేసి అన్ని వార్డులకు సరిపడా నీటిని అందించాలని, ఎక్కడ కూడ లీకేజీలు లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ... నీటి సరఫరా చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట



మేడిపల్లి, జూన్14 (ప్రజాపాలన ప్రతినిధి): ఉ ప్పల్ డివిజన్లోని బస్టాప్ వెనకాల మార్కెట్ కు వెళ్ళే మార్గంలో ప్రమాదకర స్థితిలో కరెంటు పోల్, స్థానికులు విద్యుత్ అధికారులకు మొర పెట్టుకున్న అలకించని విద్యుత్ అధికారులు, సమస్యను బీజేపీ దృష్టికి తీసుకురాగా బీజేపీ అధ్యక్షులు రెడ్డిగారి దేవేందర్ రెడ్డి కరెంటు పోల్ ను పరిశీలించి ఆందోళన వ్యక్తం చేయడం జరిగింది.ఈ సదర్భంగా రెడ్డిగారి దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ప్రతి నిత్యం మార్కెట్ కు వెళ్ళే మార్గంలో కూలిపోయే స్థితిలో ఉన్న కరెంటు పోల్ వర్షానికి కూలిపోయే ప్రమాదం ఉందని, దానివలన ప్రజలు ప్రమాద బారిన పడే అవకాశం ఉందని విద్యుత్ అధికారుల దృష్టికి ఫోన్ ద్వారా తీసుకుపోగా నిర్లక్ష్యపు సమాధానం ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఏదైనా జరగరానిది జరిగితే పూర్తి బాధ్యత విద్యుత్ ఏఈ మధు రంజన్ దే అని తెలియజేశారు. ప్రమాదకర స్థితిలో ఉన్న కరెంటు పోల్ ను వెంటనే మార్చకపోతే పెద్ద ఎత్తున బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని అవసరమైతే విద్యుత్ శాఖ కార్యాలయం ముట్టడిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. కాబట్టి ఇప్పటికైనా విద్యుత్ అధికారులు నిద్రమత్తు వీడి తక్షణమే కరెంటు పోల్ ను మార్చాలని డిమాండ్ చేశారు. విద్యుత్ బిల్లులు వసూల మీద ఉన్న శ్రద్ధ విద్యుత్ సమస్యల మీద కూడ పెట్టాలని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వర్కల రాజేందర్ గౌడ్, సింగారం కార్తీక్, ఈదులకంటి నవీన్ గౌడ్, హర్షల సంపత్, స్థానికులు నక్క చంద్రయ్య, రాజు, దేవేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన మలబార్ గోల్డ్




హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి ): ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా మంగళవారం సోమాజిగూడ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల వరకు మెగా ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ సంస్థతో కలిసి మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ మెగా రక్తదానాన్ని ప్రోత్సహిస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహించింది. రక్తదానం చేసి ప్రజల ప్రాణాలు కాపాడేందుకు షోరూములకు వాలంటీర్లను స్వాగతించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూ.హెచ్.వో) ఇతివృత్తం రక్తదానం చెయ్యడం ఐకమత్యానికి చిహ్నం, ఈ ఉద్యమంలో చేరండి ప్రాణాలను రక్షించండి అనే అంశానికి బలం చేకూర్చేలా రక్తదాతల సంఖ్యను పెంచే ఆవశ్యకతపై దృష్టి సారించింది. దీర్ఘకాలిక వ్యాధులు సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులకు చికిత్స చేయడంలో దానం చేసిన రక్తం సహాయపడుతుంది. బాధ్యతాయుతమైన వ్యాపార సంస్థగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సామాజిక సేవా కార్యక్రమాలకు తమ లాభాలలో 5 శాతం స్వచ్ఛంద, దాతృత్వ కార్యకలాపాలకు కేటాయిస్తుంది. వైద్యం, పర్యావరణ పరిరక్షణ, గృహ నిర్మాణం, విద్య, మహిళా సాధికారత వంటి ముఖ్యమైన రంగాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంపై మలబార్ గ్రూపు దృష్టి సారిస్తుంది. ఈ కార్యక్రమంలో సోమజిగూడా స్టోర్ హెడ్స్ మహమ్మద్ షేర్జ్ ,రేజాయ్, జిజిష్, మేనేజర్ కిషన్ రావు, నజీమ్, నవీన్ పాల్గొన్నారు.

## టీయూడబ్ల్యు ఐజేయు జగిత్యాల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు ఘనంగా సన్మానం

### భగవద్గీతలు ప్రదానం చేసిన ఆర్.యు.పి.పి.టి జిల్లా శాఖ



రాయికల్, జూన్ 14 (ప్రజాపాలన ప్రతినిధి):తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (ఐజెయు) జగిత్యాల జిల్లా శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఐజెయు జిల్లా అధ్యక్షులు చీటి శ్రీనివాస్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి అలుగునూరి ప్రదీప్ కుమార్ లను రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు జగిత్యాల జిల్లా శాఖ పక్షాన జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దండె రాజేందర్, వేల్పుల స్వామి యాదవ్ లు ఘనంగా శాలువాతో సత్కరించి భగవద్గీతలను ప్రదానం చేసారు. నూతన కార్యవర్గానికి భగవద్గీతలు అందజేసి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.యు.పి.పి.టి జిల్లా శాఖ బాధ్యులు చంద సత్యనారాయణ, నేరెళ్ళ శ్రీకాంత్, అన్నారంబట్ల సూర్యనారాయణ, సయీద్ పాషా, ఖదీర్, రాజేశం, రాజేందర్, రాజేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లె ప్రగతి కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ రాజు



ఇబ్రహీంపట్నం జూన్ 14 ప్రజాపాలన ప్రతినిధి :మంగళవారం రోజున 5వ విడతపల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగాయాచారం మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామ సర్పంచ్ దేరంగుల రాజు అద్వర్యంలో పల్లె ప్రగతి కార్యక్రమం నిర్వహించారు. ఈ గ్రామాల్లో పల్లె ప్రగతి కార్యక్రమం పనులను పరిశీలించిన ఎంపీపీ కొప్పు సుకన్య భాషా , ఎంపిడివో విజయలక్ష్మి, ఎంపీఓ ఉమారని, సర్పంచు దేరంగుల రాజు ఎంపిటిసి లక్ష్మీ పతిగౌడ్ , ఉపాసర్పంచ్ వినోద్ పంచాయితి కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్త సేకరణ,ఇంకుడుగుంతలు పరిశుభ్రత పరిరక్షణ, అభివృద్ధిపై మాట్లాడడం జరిగింది.

## అండర్ డ్రైనేజీ పనులను పరిశీలించిన టీఆర్ఎస్ నాయకులు బండారి రవీందర్



మేడిపల్లి, జూన్14 (ప్రజాపాలన ప్రతినిధి) :పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్15వ డివిజన్ క్రాంతి కాలనీలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను టీఆర్ఎస్ సీనియర్ నాయకులు బండారి రవీందర్ పరిశీలించారు. ఈ మేరకు కాలనీలో నెలకొన్న సమస్యల గురుంచి కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు నజియ జావీద్ ఖాన్, మాజీ వార్డు మెంబర్ బత్తి సత్యపాల్ రెడ్డి, దంతూరి వెంకటేష్ గౌడ్, 15 డివిజన్ యూత్ అధ్యక్షులు బత్తి సుమిత్ పాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ



మధిర జూన్ 14 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం నాడు ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆధ్వర్యంలోస్థానిక మండల పరిషత్ బాలికలు ఆవాస ప్రాంతంలో పర్యటించిన ఉపాధ్యాయులు ఉ పాధ్యాయునీలు పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టడం జరిగిందని మరియు పాఠశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నామని తమ పిల్లలను పాఠశాలలో చేర్పించే వలసిందిగా విద్యార్థుల తల్లిదండ్రులు కోరడం జరిగిందని ప్రతి విద్యార్థి ఇంటికి వెళ్లి ఈ విషయాలన్నీ తెలిపినట్లు బడిబాట కార్యక్రమం నిర్వహణ తెలియజేశారు.

## పట్టణ ప్రగతి కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్



రాయికల్, జూన్ 14 (ప్రజాపాలన ప్రతినిధి): రాయికల్ పట్టణం 5వ వార్డు పట్టణ ప్రగతి కార్యక్రమములో మున్సిపల్ కమిషనర్ గంగుల సంతోష్ కుమార్ పాల్గొని వార్డులోని మురికి కాలువలశుభ్రత, రోడ్ కు ఇరువైపులాఉన్న చెత్త చెదారం పిచ్చిమొక్కలను తొలగించుట,గుంతలలో నిల్వ ఉన్నమురికినీరు జెసిబి సహాయంతో మురికి కాలువలకి పంపించడం, మురికి కాలువలపై బ్లీచింగ్ చల్లించడం వంటిపారిశుధ్యపనులను ఆయనపర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ వల్లకొండ మహేష్ పురపాలక సంఘం మేనేజర్ వెంకటి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణేష్ విగ్రహాలే తయారు చేయాలి: డీసీ అరుణ కుమారి




మేడిపల్లి, జూన్14 (ప్రజాపాలన ప్రతినిధి) :ఉప్పల్ మున్సిపల్ సర్కిల్ పరిధిలో పర్యావరణానికి మేలు చేసే మట్టి గణేష్ విగ్రహాలను తయారు చేయాలని డిప్యూటీ కమిషనర్ సి. అరుణ కుమారి తయారీ దారులకు సూచించారు. పర్యావరణానికి హాని చేసే రసాయనాల విగ్రహాలు వద్దని అన్నారు. ఉప్పల్ పరిసర ప్రాంతాలలో గణేష్ విగ్రహాల తయారీ దారులతో సర్కిల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మట్టి గణేష్ విగ్రహాలే తయారు చేయాలని డిప్యూటీ కమిషనర్ సూచించారు. ప్రభుత్వాదేశాలను ఎవరూ అతిక్రమించొద్దని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత, కర్తవ్యమని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు ఆఫీసర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# నేను పుట్టి పెరిగిన ప్రపంచం..



బిఎన్.రాములు

## ధర్మపురి పయనం

పెద్దకొడుకు భీమనాతి గంగారాం పట్వారి (దాసరి) రాజేశ్వరమ్మ దంపతులు మూడు తరాల వారసత్వం నుండి అన్నావదినల వరుస బంధుత్వం. వారికి ఎనిమిది మంది సంతానం. పెద్ద కొడుకు భీమనాతి ప్రభాకర్ నా క్లాస్‌మేట్ కావడంతో తండ్రీ కొడుకుల వరుసకు బదులు పేర్లు పెట్టి పిలుచుకునేవారం. అదే అలవాటు మిగతావారందరికీ వారసత్వంగా వచ్చింది. నా క్లాస్‌మేట్ సహదేవ్‌ను చినబాపు అని పిలుస్తూ, నన్ను పేరు పెట్టి పిలవడం అప్పుడప్పుడు బాధ అనిపించేది.

ప్రభాకర్ పెళ్లి 15 మే 1974లో వరంగల్ కరీమాబాద్‌లోని గుడ్ల శ్రీదేవితో పెళ్లి జరిగింది. రెండవవాడు ప్రకాష్ హైకోర్టు అడ్వకేట్. వారి శ్రీమతి హరిలత హైదరాబాద్‌లో తార్నాకలో ఉంటారు.

మూడవవాడు చంద్రశేఖర్ ఫోటోగ్రాఫర్, మల్టీమీడియా. చంద్రశేఖర్ భార్య కొత్తపెల్లికి చెందిన భద్ర. చంద్రం చిన్నప్పుడు బాల సాహిత్యం విరివిగా చదివేవాడు. ఇప్పటికీ వేలాది పుస్తకాలు డిజిటల్ లైబ్రరీలో భద్రపరుచుకున్నాడు.

నాల్గవవాడు భీమనాతి అశోక్ కాంట్రాక్ట్‌లు చేస్తూ, తర్వాత పట్వారీగా ఉద్యోగానికి ఎక్కి విఆర్‌ఓగా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. అశోక్ భార్య మంగ దాసరి శ్రీరాములు మేనమామ కూతురే. ధర్మపురిలో దాసరి శ్రీరాములు బీడీల కంపెనీలో పని చేస్తున్నప్పుడు మంగను చిన్నప్పుడు ఎత్తుకుని ఆడించాను.

ప్రభాకర్ తర్వాత పుట్టిన పెద్దబిడ్డ విజయ జగిత్యాలలో జి.ఆర్. నర్సయ్య సార్ బిడ్డ గంగాదేవితోపాటు కలిసి హెచ్‌ఎస్సీ దాక చదువుకుంది. 1971లో సెన్నేరికుప్పం సుబ్రహ్మణ్యంతో పెళ్లి జరిగింది. ఆ వెంటనే అమెరికా వెళ్లి పిట్స్‌బర్గ్‌లో స్థిరపడ్డారు. రెండవ బిడ్డ శ్యామల, డాక్టర్ ఐతా నర్సింహరావులు బాగ్‌లింగంపల్లి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. మూడవ బిడ్డ శోభ నందం వెంకట్ అమెరికాలోని చికాగోలో స్థిరపడ్డారు. నాలుగవ బిడ్డ మంగ... ఆకుబత్తిని నరేందర్ అమెరికాలోని పిట్స్‌బర్గ్‌లో స్థిరపడ్డారు. ఇలా ధర్మపురి గంగారాం పట్వారీ, రాజేశ్వరమ్మ దంపతుల ఎనిమిది మంది సంతానంలో వారి మనుమలు, మనుమరాండ్లు ఎందరో. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తూ స్థిరపడటం, 1990 నుండి ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు ప్రవేశపెట్టిన సరళీకరణ విధానాల (ఎల్‌పిజి) ఫలితమే. మా నలుగురు పిల్లలు అమెరికా, ఆస్ట్రేలియా, ఐర్లాండ్ దేశాల్లో స్థిరపడడం కూడా అదే క్రమంలో అందివచ్చిన అవకాశాలే. అయితే అందరికీ ఈ అవకాశాలు అంది ఉంటే బాగుండేది. ఇప్పటికీ లక్షలాది మంది ఉద్యోగాలు దొరకక కులవృత్తులు, చిన్న వృత్తులు చేసుకుంటూ జీవితాలు గడుపుతున్నారు.

***దాసరి శ్రీరాములు - లక్ష్మక్క వంశావళి:***

గంగారాం పట్వారీ పెద్ద బావమరిది దాసరి శ్రీరాములు బావగారి అండ చూసుకొని జగిత్యాలనుండి సైకిల్ ట్యాక్సీ, అద్దె గ్రంథాలయం మూసేసి ధర్మపురికి చేరుకున్నాడు. దాసరి శ్రీరాములు ఇల్లు జగిత్యాలలో మా ఇంటి పక్కనే. మూడు తరాలనుండి చుట్టరికంతో నాక్కూడా చిన్నప్పటినుండి బావ వరుసే. గంగారాం పట్వారీ తమ్ముడు భీమనాతి రాఘవులు ఆర్‌ఎంపి డాక్టర్‌గా, ఆయుర్వేద వైద్యుడుగా పనిచేస్తూ 1960ల నుండి జగిత్యాలకు వచ్చినప్పుడల్లా మా తాతను, అమ్మను, మేనమామ రాములు మామను పలకరిస్తూ, అప్పుడప్పుడు భోజనం చేస్తూ, అక్కడి విశేషాలు, ఇక్కడి విశేషాలు చెప్తుండేవాడు. ఆ తర్వాతే గంగారాం పట్వారీ పరిచయంలోకి వచ్చాడు. రాఘవులు నా క్లాస్‌మేట్ ప్రభాకర్‌కు చిన్న బాపుగా ముందే పరిచయమయ్యాడు. ప్రభాకర్ తల్లి రాజేశ్వరి వదినె, మా అమ్మ చిన్నప్పటినుంచే బంధుత్వం, స్నేహం.

దాసరి శ్రీరాములు బావ నన్ను చిన్నప్పటినుండి అరేయ్ తురేయ్ అని పిలుస్తుండేవాడు. దాసరి శ్రీరాములు లక్ష్మి దంపతులకు ముగ్గురు బిడ్డలు. ఒక కొడుకు. పెద్ద బిడ్డ అంజలి టీచర్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యింది. వాళ్ళాయన శంకర్. సింగరేణిలో పనిచేసి వి.ఆర్.ఎస్. తీసుకున్నాడు. రెండవ బిడ్డ మంగను మేన సంబంధంగా ప్రభాకర్ చిన్న తమ్ముడు భీమనాతి అశోక్‌కు ఇచ్చి పెళ్లి చేశారు.

(మిగతాభాగం రేపటి సంచికలో..)

# రాజీవ్ స్వగృహ భూముల వేలం పాట రద్దు చేయాలి

## సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.వాసువదేవ రెడ్డి



కరీంనగర్ జూన్ 14 ప్రజాపాలన ప్రతినిధి :తిమ్మాపూర్ లో ఉన్న రాజీవ్ స్వగృహ భూములను ఈనెల 20న జరిగే వేలం పాటను రద్దుచేసి అర్హులైన లబ్దిదారులు ఇవ్వాలని అఖిల పక్షం నేతలు జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నాకు దిగారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కురి వాసుదేవ రెడ్డి ఈ సందర్భగా ట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైయస్ రాజశేఖర్రెడ్డి 2007 సంవత్సరంలో అందరికీ అందుబాటులో ఉండాలని మార్కెట్ రేటు కన్నా దాదాపు 20 శాతం తక్కువ ధరకు ఇళ్లు అని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరిగింది మధ్యతరగతి ప్రజల నుండి ఆనాడు 2007 నుండి 2 సర్వే నిర్వహించి ఒక్కొక్క దరఖాస్తు దారు నుండి ఖరీదు రెండు వందల రూపాయలు మరియు ధరావత్తు 5 వేలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అర్జీలు స్వీకరించారు. నేడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భూమి రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ వారు నేను బహిరంగ మార్కెట్లో వేలం ధర అమ్ముటకు ప్రయత్నించడం సిగ్గుచేటు కలెక్టర్ గారు రాష్ట్ర ప్రభుత్వం జిల్లా మంత్రి గారు ప్రత్యేక చొరవ తీసుకొని ఇట్టి వేలం పాట ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆనాడు మధ్యతరగతి వారు ఏదైతే డబ్బులు కట్టడం ఇప్పుడు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి కనిపిస్తోందని మండిపడ్డారు డబ్బులతో భూమి సేకరించి నందుకు భూమి చెందాలని డిమాండ్ చేశారు. రాజీవ్ స్వగృహ అధికారులలో ఇంటిస్థలం రాని వారికి 10 శాతం వడ్డీతో తిరిగి చెల్లించాలి 15 సంవత్సరాల కాలం తర్వాత వారి డిపాజిట్ 5వేల రూపాయలు తిరిగి చెల్లించడం తీవ్ర అన్యాయమని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరిని వీడి రాజీవ్ స్వగృహ వేలం పాటను రద్దుచేసి మధ్యతరగతి ప్రజలకు భూములు చందే విధంగా కృషి జరగాలి అని హెచ్చరించారు. లేనిపక్షంలో రాజీవ్ స్వగృహ అర్జీదారుల న్యాయం జరిగే వరకు భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు పార్టీ మద్దతు తెలుపుతూ ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. ముకుందరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు శనిగరపు రజినీకాంత్ పార్టీ నగర నాయకులు కవ్వంపెల్లి అజయ్,జి తిరుపతి,జి, శ్రీకాంత్,రైకంటి శ్రీనివాస్, కంపెల్లి అరవింద్, రాకెష్,అభినయ,శ్రీనివాస్ నరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దగ్ధం



కరీంనగర్ జూన్ 14 ప్రజాపాలన ప్రతినిధి : ఏఐసీసీ అధ్యక్షురాలు శ్రీమతి సోనియాగాంధీ పార్లమెంట్ సభ్యులు రాహుల్ గాంధీల పై బిజెపి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి, ఈ డి నోటీసులు పంపడాన్ని నిరసిస్తూ, టిపిసిసి ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోడీ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కుటుంబ సభ్యులైన శ్రీమతి సోనియాగాంధీ ,రాహుల్ గాంధీలపై కక్షపూరితంగా ఇడితో నోటీసులు పంపడాన్ని దేశవ్యాప్తంగా ప్రజలంతా తీవ్రంగా ఖండిస్తున్నారన్నారు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలం సైనికులమై గర్జిస్తామని హెచ్చరించారు. దేశంలో ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను వేలం వేస్తూ, అమ్ముకుంటున్న మోడీకి ఈడీ నోటీసులు పంపి జైల్లో పెట్టాల్లన్నారు., ఎలాంటి మచ్చ లేని నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీల పై కక్షపూరితంగా నోటీసులు పంపుతున్నారన్నారు,దేశాన్ని విచ్చిన్నం చేస్తూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతూ రకరకాలుగా ప్రజల్ని వంచిస్తూ, పెట్రోల్ ,డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను పెంచి, ప్రజలను రోడ్లమీద పడేస్తున్నారన్నారు, రూపాయి విలువ పడగొట్టి ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నా బి జె పి నాయకులను జైల్లో పెట్టాలన్నారు, నాయకుల మీద ఈగ వాలినా చూస్తూ ఊరుకోబోమని బిజెపి నాయకులను వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగంపల్లి బాబు, గుండాటి శ్రీనివాసరెడ్డి, విక్టర్ ,ఎజ్రా, ఎండి చాంద్ ,శబనా మహమ్మద్ ,మామిడి సత్యనారాయణ రెడ్డి, కొరివి అరుణ్ కుమార్, యనమల మంజుల, షాహిన్ షా ,దండి రవీందర్ ,సలీమ్ ఉద్దీన్, ముక్క భాస్కర్, నదీం, జీలకర్ర రమేష్, కుంభాల రాజు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## షర్మిల ప్రజాప్రస్థానం పాదయాత్ర అడుగడుగునా నీరాజనం పలికిన ప్రజలు



మధిర జూన్ 14 ప్రజా పాలన ప్రతినిధి పేద నియోజకవర్గ పరిధిలో మంగళవారం నాడు చింతకాని మండలం పాతర్ల పాడు గ్రామంలో నిరుద్యోగ దీక్ష ప్రారంభించిన తెలంగాణ వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షుడు షర్మిల మద్దతుగా భారీగా తగ్గిన నిరుద్యోగ యువత వైఎస్ఆర్ అభిమానులు ఆమెతో పాదయాత్రలో పాల్గొన్న నియోజకవర్గ ఇంచార్జ్ కిషోర్ కుమార్ దొంతమాల. పాతర్లపాడులో నిరుద్యోగ నిరాహారదీక్ష చేపట్టనున్న షర్మిల తెలంగాణ వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షురాలు %హా% షర్మిల చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్ర ఈ రోజు ముష్టికుంట్ల నైట్ క్యాంప్ నుండి ప్రారంభమైంది. నాగులవంచ రైల్వేకాలనీ,పాతర్లపాడులోపాదయాత్రకొనసాగనుంది. అ నంతరం పాతర్లపాడులో మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఆమె నిరుద్యోగ దీక్ష చేపట్టనున్నారు. మధిర నియోజకవర్గ కో ఆర్డినేటర్ కిషోర్ కుమార్ దొంతమాల పాదయాత్రలో పాల్గొంటూ గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను షర్మిలకు వివరిస్తున్నాడు. ఈ కార్యక్రమంలో చింతకాని,బోనకల్ మండల నాయకులు వాకా వీరారెడ్డి,ఇరుగు జ్ఞానేశ్, మౌలాలి,సైదాబాబు,మురళి మైనార్టీ నాయకులు ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య: ఎంపీపీ లలిత

మధిర జూన్ 14 ప్రజా పాలన ప్రతినిధి మండలం పరిధిలో మంగళవారం నాడు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని మధిర మండల పరిషత్ అధ్యక్షురాలు మెండెం లలిత ఎంపీడీవో కుడుముల విజయ భాస్కర్ రెడ్డి మండల విద్యాశాఖ అధికారి వై ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని వంగవీడు ప్రాథమికోన్నత పాఠశాలలో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంతో పాటు ఉచితంగా పుస్తకాలు, భోజనం దుస్తులు అందించడం జరుగుతోందని వారు తెలిపారు. అంతేకాకుండా ప్రతిభ కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు తల్లిదండ్రులు అందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని వారు కోరారు. అనంతరం వంగవీడు పాఠశాలలో 7వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను మధిర టివిఎం పాఠశాలలో చేర్పించాలని ఆ పాఠశాల ఉపాధ్యాయులు వంగవీడు వచ్చి తల్లిదండ్రులను కలిశారు. ఈ కార్యక్రమంలో మండల ఏఈ ప్రదీప్ సర్పంచ్ బొగ్గుల పద్మావతి విద్యా కమిటీ చైర్మన్ సత్యంబాబు ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ రెడ్డి ఉపాధ్యాయుల నరసింహారావు శ్యామల రావు గుల్జార్ సునీత కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ ప్రగతిలో ప్రభుత్వ స్థలాన్ని కాపాడిన ఎమ్మెల్యే కార్పొరేటర్





మేడిపల్లి, జూన్14 (ప్రజాపాలన ప్రతినిధి) :రామంతాపూర్ డివిజన్ సాయి క్రిష్ణ నగర్ కాలనీలో నిర్వహించిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, స్థానిక కార్పోరేటర్ బండారు శ్రీ వాణి వెంకట్రావుల దృష్టికి కాలనీలో ప్రభుత్వానికి చెందిన స్థలాన్ని కబ్జా కోరల నుంచి సుమారు 60 గజాల స్థలాన్ని రక్షించాలని కాలనీవాసులు కోరారు. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే, కార్పొరేటర్ వెంటనే అట్టి స్థలంలో జిహెచ్ఎంసి బోర్డు ఏర్పాటు చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ స్థలంలో జిహెచ్ఎంసి అధికారులతో చర్చించి కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమీద, కపుసల్య,లక్ష్మి,సునీత, ఉత్తరమ్మ,బాలకృష్ణ,అల్లాడి నిరంజన్ గౌడ్,సుదర్శన్,నరసింహ, పలువురు కాలనీవాసులు నాయకులు పాల్గొన్నారు.

## పట్టణ ప్రగతి కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి



ఇబ్రహీంపట్నం జూన్ 14 ప్రజాపాలన ప్రతినిధి:మంగళవారం రోజున ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో భాగంగా 4వ పట్టణ ప్రగతి కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చేర్మెన్ ఆకుల యాదగిరి మరియు కమీషనర్ ఎండీ యూసుఫ్ ఆధ్వర్యంలో 7.8.9. వార్డులాల్లో నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మున్సిపాలిటీ అధ్యక్షులు అల్వాల్ వెంకట్ రెడ్డి కౌన్సిలర్ లు కొండ్రు శ్రీలత రాంబాబు నల్లబోలు మమత శ్రీనివాస్ మంద సుధాకర్ జర్కొని బాలరాజ్ భర్తకి జగన్ నీళ్ల భానుబాబు గౌడ్ మరియు సీనియర్ నాయకులు బర్ల జగదీశ్ కసరమోని మల్లేష్ ముత్యాల నరేష్ (చిన్న) కొండ్రు రాంబాబు మరియు నాయకులు రాఘవేందర్, గాజుల గోపాల్ జంగయ్య పాల్గొన్నారు.

## పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

### కార్పొరేటర్ శ్రీవాణి వెంకట్రావు





మేడిపల్లి, జూన్14 (ప్రజాపాలన ప్రతినిధి):రామంతాపూర్ డివిజన్లో పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు అధికారులకు సూచించారు. 10వ రోజు పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా డివిజన్లోని శారద నగర్లో వివిధ సమస్యలపై కాలనీలలో పెండింగ్లో ఉన్న పనులపై అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. శారద నగర్ లో సిల్ట్ మట్టి, డ్రైనేజీ సమస్య, వాటర్ సమస్యలపై కార్పొరేటర్ అధికారులకు వివరించి త్వరితగతిన పనులను పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి వెంకటరమణ,డిఈ చందన, వాటర్ డిపార్ట్మెంట్ మేనేజర్ ప్రభాకర్ రెడ్డి, మరియు కాలనీవాసులు అమ్మన వెంకటరెడ్డి,మధు, బిజెపి నాయకులు ముత్తినేని జగదీష్, పడిగే నాగేష్, పరి శ్రీనివాస్, ఓంకార్, తదితరులు పాల్గొన్నారు.

## నాంపల్లి కోర్టు లో 1539 మంది న్యాయవాదులకు ఆరోగ్య కార్డులను అందజేసిన తెలంగాణ ప్రభుత్వం....



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి ): తెలంగాణ అడ్వొకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ప్రతి యేటా జారీ చేసే ఆరోగ్య కార్డులను ఈరోజు నాంపల్లి క్రిమినల్ కోర్ట్ బార్ అసోసియేషన్ ప్రతినిధులకు యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ మెడిసేవ ఆఫీసర్ వెంకట్ తదితరులు అందజేసారు. గత నెలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదుల ఆరోగ్య కార్డుల రెన్యూవల్ కొరకు 6 కోట్లు విడుదల చేయడం జరిగింది. ఇంతకు ముందు నాంపల్లి కోర్టు లో ఈ ఆరోగ్య కార్డులు కలిగివున్న 1539 మంది న్యాయవాదులకు వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన కార్డులను ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధుల నుండి ఈ రోజు నాంపల్లి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జాయింట్ సెక్రటరీ జక్కుల లక్ష్మణ్ స్వీకరించారు. అదేవిదంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కి కృతజ్ఞతలు తెలిపారు.



## అంటే.. అన్ని

# సినిమాలను అలా చూడవద్దు ప్లీజ్



నేచురల్ స్టార్ నాని నజ్రియా నజీమ్ జంటగా నటించిన చిత్రం అంటే సుందరానికి భారీ అంచనాల మధ్య రిలీజై మిశ్రమ ఫలితాలు అందుకుంటోంది. నాని ఫ్యాన్సున్ను ఈ సినిమా నిరాశపరిచినట్లే కనిపిస్తోందని సినీ విశ్లేషకులు అంటున్నారు. నాని యాక్టింగ్కి ఎదురు లేకపోయినా.. సినిమాలో ల్యాగ్ ఎక్కువగా ఉందని.. కొన్ని సీన్లను కత్తిరిస్తే బాగుండేదని అభిప్రాయం వెలువడుతోంది. ఈ నేపథ్యంలో అంటే సుందరానికి టీం సక్సెస్ మీట్ పెట్టడం చర్చనీయాంశమైంది. సినిమా ఫ్లాప్ అయినా సక్సెస్ మీట్లు ఏంట్రా బాబు అంటోన్న కొందరికి నాని స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.జూన్ 10న విడుదలైన అంటే సుందరానికి సినిమా సక్సెస్ మీట్ను హైదరాబాద్లో నిర్వహించారు. నేచురల్ స్టార్ నాని నజ్రియా జంటగా.. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో భారీ అంచనాలతో విడుదలైన ఈ సినిమా మిశ్రమ ఫలితాలను అందుకుని అభిమానులను నిరాశపరిచింది. అయినా.. ఈ సినిమాకు సక్సెస్ మీట్ పెట్టడం టాలీవుడ్లో చర్చనీయాంశమైంది. మరోవైపు ఫ్యాన్స్ కూడా ఫ్లాప్ సినిమా కు సెలబ్రేషన్స్ ఏంటని విస్తుపోతున్నారు. ఈ క్రమంలో సక్సెస్ మీట్లో హీరో నాని కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.“అంటే సుందరానికి టీమ్ అందరికీ థాంక్స్. అందరం కలిసి ఇంత బ్యూటిఫుల్ ఫిల్మ్ క్రియేట్ చేయగలిగినందుకు. అందరు అంటున్నారు మూడు రోజులకే సక్సెస్ సెలబ్రేషన్స్ ఏంటి అని.. ఈరోజు మేము సెలబ్రేట్ చేసుకుంటుంది నంబర్స్ను కాదు హార్ట్స్ను.. మా సినిమాకి ఎంత ప్రేమ దక్కింది చూసిన వాళ్లు ఎంత బాగా ఎంజాయ్ చేశారు అనే దాన్ని మేం వేడుక జరుపుకుంటున్నాం.బాక్సాఫీస్ బ్లాక్ బస్టర్ అవునా కాదా అనేది కాలం నిర్ణయిస్తుంది. కానీ సినిమా చూసిన వారి కళ్లలో ఆనందం చూస్తూంటే మేము ఆల్రెడీ బ్లాక్ బస్టర్ కొట్టేశాం అనిపిస్తోంది. మంచి సినిమాలు చాలా అరుదుగా వస్తాయి. అందులో ‘అంటే సుందరానికి’ ఒకటి” అని చెప్పుకుంటూ వచ్చారు నాని.“ఈ సందర్భంగా మీడియా మిత్రులకు సోషల్ మీడియా వారియర్స్కు ఒక విషయం చెప్తున్నాను. కొత్తగా ట్రై చేసినప్పుడు ఒక మాస్ మూవీ తో కంపేర్ చేయడం కలెక్షన్స్ ఎందుకు రాలేదు అని అడగడం కాదు. ఒక మంచి సినిమా వచ్చినప్పుడు వారి భుజాల మీద ఎత్తుకొని దాన్ని ముందుకు తీసుకెళ్తే తెలుగు సినిమా వేస్తున్న కొత్త అడుగు లో మనం అందరం భాగం అవుతాం. ఇది అందరం సెలబ్రేట్ చేసుకోవాల్సిన సినిమా. ఇది మన విజయం.రేపు ఈ సినిమా ఎక్కడికి వెళ్తోంది. బాక్సాఫీస్ను రీచ్ అవుతుందా లేదు అనేది ప్రేక్షకులకు వదిలేస్తున్నాం. ఒక పదేళ్ల తరువాత వెనక్కి తిరిగి చూసుకుంటే నా కెరీర్లో గొప్ప సినిమాల్లో అంటే సుందరానికీ ఒకటి ఉంటుంది అని నేను గర్వంగా చెప్పుకోగలను. ఇలాంటి కథలు చెప్పడానికి గట్స్ కావాలి. అవి మా డైరెక్టర్ వివేక్లో ఉన్నాయి. ఇది ఆవకాయ లాంటి సినిమా. రోజు రోజుకు ఈ సినిమా ఊరుతుంది” అన్నారు నాని. నాని కామెంట్స్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. మరోవైపు మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ.. “అంటే సుందరానికీ%ూ% మాకు గొప్ప అనుభూతినిచ్చిన చిత్రం. మా బ్యానర్లో ఎప్పటికీ నిలిచిపోయే చిత్రం. ఇదో క్లాసిక్. ఈ సినిమా తీసినందుకు నిర్మాతలుగా మేము చాలా గర్వంగా ఫీలవుతున్నాం”అని అన్నారు.

# ‘విరాటపర్వం’ కు భారీ అడ్వాంటేజ్




రానా దగ్గుబాటి హీరోగా నటించిన లేటెస్ట్ క్రేజీ మూవీ విరాటపర్వం. వేణు ఊడుగుల తెరకెక్కించారు. సాయి పల్లవి చుట్టూ సాగే సివిల్ వార్ బేస్డ్ లవ్ డ్రామాగా ఈ మూవీని రూపొందించారు. 1992 లో జరిగిన ఓ యాదార్ధ సంఘటన ఆధారంగా ఈ మూవీని రూపొందించినట్టుగా దర్శకుడు వెల్లడించారు. ఓ యువతి చుట్టూ జరిగిన రాజకీయ నేపథ్యాలని కళ్లకు కట్టినట్టుగా చూపించే ప్రయత్నమే ఈ మూవీ.సురేష్ ప్రొడక్షన్స్ డి. సురేష్ బాబు సమర్పణలో ఎస్. ఎల్.వి సినిమాస్ బ్యానర్ పై చెరుకూరి సుధాకర్ ఈ మూవీని అత్యంత భారీ స్థాయిలో నిర్మించారు. రానా హీరో అయినా సినిమా మొత్తం సాయి పల్లవి చుట్టూ తిరగుతుంది. కథ ప్రధానంగా ఉత్తర తెలంగాణలో 1990 లో జరిగిన సంఘటనలు నక్సల్ ఉద్యమం నేపథ్యంలో సాగే సినిమా ఇది. కామ్రేడ్ రవన్న అరణ్య పేరుతో రాసే కవితలకు ప్రేరేపితురాలైన వెన్నెల అనే యువతి అతన్ని వెతుక్కుంటూ అడవి బాటపడుతుంది.ఈ క్రమంలో తను ఎదుర్కొన్న సంఘటనల సమాహారమే ఈ విరాటపర్వం. గత ఏడాది కాలగా రిలీజ్ వాయిదా పడుతూ వస్తున్న ఈ మూవీ ఎట్టకేలకు జూన్ 17న బారీ స్థాయిలో ప్రపంచ వ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. లేట్ గా వస్తున్నాఈ మూవీకి మంచి అడ్వాంటేజ్ అభించింది. ఇటీవల విడుదలైన సినిమాలు వారం రోజుల తరువాత ఆశించిన స్థాయిలో వసూళ్లని రాబట్టలేకపోతున్నాయి. గత కొన్ని వారాలుగా వరుసగా పెద్ద సినిమాలు విడుదలయ్యాయి.కానీ ఫస్ట్ వీక్ తరువాత మాత్రం నిరాశను పరిచాయి. మే 27న ఎఫ్ 3 విడుదలై మంచి టాక్ ని సొంతం చేసుకుంది. ఆ తరువాత విడుదలైన మేజర్ విక్రమ్ కూడా సూసర్ హిట్ టాక్ ని సొంతం చేసుకున్నాయి. ఈ రెండు సినిమాల రిలీజ్ ల తరువాత ఎఫ్ 3 కలెక్షన్స్ దారుణంగా పడిపోయాయి.ఇక ఆ తరువాత వచ్చిన అంటే సుందరానికి కారణంగా విక్రమ్ వసూళ్లపై ప్రభావం పడింది. ఈ మూవీ తరువాత వచ్చే వారం విరాటపర్వం రిలీజ్ కాబోతోంది. ఇప్పటికే నాని సినిమా వసూళ్లు తగ్గుముఖం పట్టాయి. విరాటపర్వం తరువాత ఆ డ్రాప్ మరింతగా పెరిగే అవకాశం వుంది. అయితే ఇక్కడే విరాటపర్వంకు మంచి అడ్వాంటేజ్ లభించింది. ఈ మూవీ తరువాత ఎలాంటి పెద్ద సినిమా రిలీజ్ కావడం లేదు. జూలై ఒకటి వరకు ఎలాంటి పెద్ద సినిమా ఈ మూవీకి పోటీగా రావడం లేదు. రెండు వారాల పాటు ఈ సినిమాకు మంచి టైమ్ లభించబోతోంది. దీన్ని అడ్వాంటేజ్ గా తీసుకుని విరాటపర్వం భారీ వసూళ్లని రాబడుతుందో లేదో వేచి చూడాల్సిందే.

# జోకులు మీమ్ లతో నిర్మాతను ఆడుకున్నారు!





ప్రముఖ దర్శకనిర్మాత కరణ్ జోహార్ పై అంతర్జాలంలో రకరకాల జోకులు ఛలోక్తులు వేడెక్కిస్తున్నాయి. అతడు ఏం చేసినా యూత్ లో ఒక సెక్షన్ ఆట పట్టిస్తూ ఉండటం కామన్ అయినా కానీ ఈసారి అందుకు భిన్నంగా అతడిని కామెడీ చేసేస్తుండడం మీడియాలో చర్చకు వచ్చింది.తాజాగా రిలీజైన ఒక పాట కరణ్ పై జోకులు పేల్చేందుకు కారణమైంది. కరణ్ జోహార్ నిర్మిస్తున్న మోస్ట్ అవైటెడ్ రొమాంటిక్ కామెడీ ‘జగ్ జగ్ జియో’ త్వరలో థియేటర్లలోకి రానుంది. తాజాగా ఈ చిత్రంలోని ‘దుపట్టా’ అనే పాటను చిత్రనిర్మాత కరణ్ జోహార్ విడుదల చేసారు.దుపట్టా అనేది పాపీ స్టైల్ డ్యాన్స్ సాంగ్.. ఇది ఒక రకంగా రీమిక్స్ లాంటిది. ఈ పాట ఆద్యంతం నిజానికి దుపట్టా (స్కార్ఫ్) చుట్టూ తిరుగుతుంది. అయితే మొత్తం పాటలో ఒక్కసారి కూడా దుపట్టా ఉపయోగించకపోవడంతో అభిమానులు చాలా వింతగా ఉందంటూ కామెంట్లు చేస్తున్నారు. ఒక రకంగా కొరియోగ్రాఫర్ కి పడాల్సిన అక్షింతలు కరణ్ జోహార్ కి పడిపోతున్నాయ్.సోషల్ మీడియాల్లో నెటిజనులు కరణ్ జోహార్ ను ఒక రేంజులో ట్రోల్ చేయడం ప్రారంభించారు. చాలామంది సరదా జోకులు మీమ్ లతో కామెంట్ సెక్షన్ లో వేడెక్కిస్తున్నారు. దుపట్టా ఎక్కడ తప్పిపోయింది కరణ్ జీ? అంటూ ఒక నెటిజనుడు అడిగారు. ఒక ట్విట్టర్ యూజర్ ఫిల్మ్ మేకర్ కరణ్ ని “దుపట్టా ఎక్కడ ఉంది బ్రో?” అని అడిగాడు.బ్రూహ్ కనీస మాత్రంగా అయినా వీడియోలో సింబాలిక్ దుపట్టా కనిపించలేదు? అని వేరొక నెటిజన్ ప్రశ్నించాడు. దుపట్టా థీమ్ తో వచ్చిన పాటలో అసలు దుపట్టా కనిపించకపోవడం విచిత్రమే. కొరియోగ్రాఫర్ కి ఇదేదీ ఐడియా లేదా? అంటూ అంతా ఆశ్చర్యపోతున్నారు.ఇంతకు ముందు ఈ చిత్రంలోని మరో రెండు పాటలు ‘నాచ్ పంజాబన్’.. ‘రంగీ సారీ’ విడుదలయ్యాయి. ఇవి రెండూ పాత బాలీవుడ్ ట్రాక్ లకు రీమిక్స్ సాంగ్స్. ఒరిజినల్ మ్యూజిక్ ట్రాక్ లకు బదులుగా కరణ్ జోహార్ తన చిత్రానికి కాపీ పాటలను మాత్రమే ఎంచుకున్నారని కొందరు నెటిజనులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. జగ్ జగ్ జియో త్వరలో విడుదల కానుంది. అదే క్రమంలో కరణ్–ధావన్ జోడీ ప్రమోషన్స్ లో వేడిని పెంచింది.

# అల్లువారబ్బాయి కెరీర్ గాడిలో పడేనా..?



టాలీవుడ్ లో ఇప్పుడు స్టార్ హీరోల దగ్గర నుంచి కుర్ర హీరోల వరకూ అందరూ వరుస ప్రాజెక్ట్స్ తో బిజీగా ఉన్నారు. పాండమిక్ కారణంగా కొన్నాళ్లపాటు సినిమాలకు దూరంగా ఉన్నవారంతా.. ఎన్నడూ లేని విధంగా కొత్త చిత్రాలకు సైన్ చేస్తున్నారు. ఒక సినిమా సెట్స్ మీద ఉండగానే మరో మూవీ షూటింగును మొదలు పెడుతున్నారు. ఇండస్ట్రీలో అందరిలో నూతనోత్సాహం కనిపిస్తుంటే యంగ్ హీరో అల్లు శిరీష్ మాత్రం తన లైనప్ గురించి ఎలాంటి హింటూ ఇవ్వడం లేదు.లెజండరీ నటుడు అల్లు రామలింగయ్య మానవుడిగా అగ్ర నిర్మాత అల్లు అరవింద్ తనయుడిగా స్టార్ హీరో అల్లు అర్జున్ సోదరుడిగా ఇండస్ట్రీలో అడుగుపెట్టాడు శిరీష్. మెగా ఫ్యామిలీ అండతో వచ్చినప్పటికీ.. తొలి సినిమా ‘గౌరవం’ ఆశించిన విజయాన్ని అందించలేకపోయింది. ఈ క్రమంలో వచ్చిన సినిమాల్లో ‘శ్రీరస్తు శుభమస్తు’ మాత్రమే సక్సెస్ అయింది. ఈ నేపథ్యంలో కాస్త గ్యాప్ తీసుకొని చేసిన ‘ఏబీసీడీ’ సినిమా కూడా ఫ్లాప్ అయింది. ఇలా దశాబ్దం క్రితమే కెరీర్ స్టార్ట్ చేసినా ఇంతవరకు శిరీష్ హీరోగా నిలబడలేకపోయాడు.మెగా ఫ్యామిలీ నుంచి ఇండస్ట్రీలో హీరోలుగా ఎంట్రీ ఇచ్చిన వారిలో చాలామంది ఇప్పుడు సక్సెస్ ఫుల్ కెరీర్ కొనసాగిస్తున్నారు. స్టార్ హీరోలను పక్కన పెడితే వరుణ్ తేజ్ – సాయి ధరమ్ తేజ్ లు టైర్–2 హీరోలలో తమకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. గతేడాది లాంచ్ చేయబడిన పంజా వైష్ణవ్ తేజ్ కూడా డెబ్యూ మూవీతో బ్లాక్ బస్టర్ అందుకొని.. పలు క్రేజీ ప్రాజెక్ట్స్ సెట్ చేసుకున్నాడు. కానీ శిరీష్ కెరీర్ మాత్రం ఆశించిన విధంగా ముందుకు సాగడం లేదనిపిస్తోంది. సాధారణంగా పెద్ద ఫ్యామిలీల నుంచి ఇండస్ట్రీకి వచ్చే హీరోలకు ఆఫర్స్ విషయంలో డోకా ఉండదు. పేరున్న దర్శకులతో బడా బ్యానర్స్ సినిమాలు నిర్మించడానికి రెడీగా ఉంటాయి.. లేకపోతే హోమ్ ప్రొడక్షన్ లో అయినా మంచి ప్రాజెక్ట్స్ సెట్ చేస్తుంటారు. కానీ అల్లు అరవింద్ వంటి స్టార్ ప్రొడ్యూసర్ కొడుకైనప్పటికీ.. ఒక్కసారి శిరీష్ సినిమాలు గమనిస్తే మొదట్నుంచీ అతని కెరీర్ ను గాడిలో పెట్టడానికి జాగ్రత్తలు తీసుకోలేదేమో జరగలేదేమో అనిపిస్తుంది.గీతా ఆర్ట్స్ బ్యానర్ లో అల్లు శిరీష్ హీరోగా ‘‘ప్రేమ కాదంట’’ అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ న్యూ ఏజ్ రొమాంటిక్ ఎంటర్టైనర్ కు ‘జత కలిసే’ ఫేమ్ రాకేష్ శశి దర్శకత్వం వహిస్తున్నారు. వినూత్నమైన కథా కథనాలతో వస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ ను గతేడాదే వదిలారు. అను ఇమ్మాన్యుయేల్ తో అల్లువారబ్బాయి లిప్ లాక్ సీన్స్ కొన్నాళ్లపాటు అందరూ చర్చించుకునేలా చేసింది. అయితే ఆ తర్వాత సినిమా నుంచి మరో అప్డేట్ లేదు.కరోనా పాండమిక్ తర్వాత పరిశ్రమ నార్మల్ అవడంతో ఎప్పటిలాగానే కార్యక్రమాలు జరుగుతున్నాయి. కానీ అల్లు శిరీష్ సినిమా ఎక్కడి దాకా వచ్చింది.. ఏ స్టేజీలో ఉంది.. ఎప్పుడు రిలీజ్ అవుతుంది అనే విషయంపై ఎలాంటి సమాచారం లేదు. దీంతో “ప్రేమ కాదంట” చిత్రంపై రకరకాల రూమర్స్ వినిపిస్తున్నాయి. త్వరలో ఏదొక అప్డేట్ వదిలి వాటికి చెక్ పెట్టాలని అభిమానులు కోరుకుంటున్నారు. పాన్ ఇండియా స్థాయిలో సత్తా చాటుతున్న అన్న బన్నీ మాదిరిగానే.. అల్లు శిరీష్ కూడా నిలదొక్కుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. అయితే పెద్ద ఫ్యామిలీ బ్యాగ్రౌండ్ ఉన్నప్పటికీ.. శిరీష్ క్రేజీ ప్రాజెక్ట్స్ సెట్ చేసుకోకపోవడానికి కారణం తన సొంత కష్టంతో పేరు తెచ్చుకోవాలని ఫిక్స్ అవ్వడమే అని అంటున్నారు. అందుకే శిరీష్ కమర్షియల్ సినిమాల వైపు పరుగులు తీయకుండా.. కంటెంట్ ను నమ్ముకొని ముందుకు వెళుతున్నాడని చెబుతున్నారు. ‘విలాయతి శరాబ్’ అనే హిందీ మ్యూజిక్ ఆల్బమ్ తో నేషనల్ వైడ్ పాపులర్ అయిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. త్వరలోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకొని ఇండస్ట్రీలో నిలబడతాడని ధీమా వ్యక్తం చేస్తున్నారు.




Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part ‘A’), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989